మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసిన కలెక్టర్

### సమయం కాకముందే విద్యార్థులను బయటకు ఎలా పంపిస్తావు



హాజరు రిజిస్టర్ ను తనిఖీ చేసిన కలెక్టర్

**అయిజ, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త :** పాఠశాల సమయం కాకముందే విద్యార్థులను ఇంటికి పంపిన కారణంగా జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ బి ఎం సంతోష్ ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయిని సస్పెండ్ చేయడం జరిగింది. మంగళవారం అయిజ కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ (బాలుర పాఠశాల)లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. తనిఖీ సందర్భంగా పాఠశాల సమయములో విద్యార్థులందరూ గైర్హాజరుగా ఉన్నారు. దీనిపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఇది ప్రభుత్వ సెలవు కాదు. అధికారికంగా కూడా ఎటువంటి సెలవు లేదు. అయితే విద్యార్థులను అనుమతి లేకుండా విద్యార్థులను ఇంటికి ఎందుకు పంపించారు?" అని ఉపాధ్యాయులను ప్రశ్నించారు. దీనికి ఉపాధ్యాయులు. ఈ రోజు మాల పున్నమి కావడంతో విద్యార్థులు ఇంటికి వెళ్లారు" అని సమాధానం ఇచ్చారు. అయితే దీనిపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ, "ప్రభుత్వం ప్రకటించని సెలవును మీరు ఎలా ఇస్తారు అని ప్రశ్నించాడు. పిల్లలు ప్రతిరోజూ పాఠశాలకు వచ్చి బోధన పొందాలి. మీరు ప్రోత్సహించకపోతే విద్యార్థులు చదువు ఎక్కడ నేర్చుకుంటారు అని అన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శేషపాణి శర్మను సస్పెండ్ చేయాలని జిల్లా విద్యాధికారికి కలెక్టర్ ఆదేశించారు. ఉపాధ్యాయుల హాజరు పట్టికను స్వయంగా పరిశీలించారు. ప్రతి రోజు ఉపాధ్యాయులు, విద్యార్థులందరూ 100 శాతం హాజరుగా ఉండాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు ఉత్తమ విద్య అందించడం ఉపాధ్యాయుల ప్రధాన బాధ్యతని, ఆ దిశగా కృషి చేసి వంద శాతం ఫలితాలు సాధించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రాములు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్రబోయి

### విద్యార్థులకు నాణ్యమైన

## విద్య అందించాలి

### కలెక్టర్ విజయేందిర బోయి

**బాలానగర్, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి, 10వ తరగతి వార్షిక పరీక్షలలో మెరుగైన ఫలితాలు రాబట్టాలని సూచించారు. బాలానగర్ మండలంలోని ఉడిత్యాలలో ప్రాథమిక ఉన్నతపాఠశాల, గుండేడ్ గ్రామంలోని పల్లె దవాఖానను కలెక్టర్ విజయేందిర బోయి సందర్శించారు. ఉడిత్యాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు విద్యా బోధనపై ఆరా తీశారు. పాఠశాలకు రెగ్యులర్ హాజరుకాని విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. అక్షయపాత్ర భోజనంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రహరీ గోడ, విద్యుత్ తీగల తొలగింపు త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గుండేడు గ్రామంలో పల్లె దవఖానలో రోగులకు అందుతున్న వైద్యం, మందులకొరత, ఓపీ నమోదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో సీజనల్ వ్యాధులు సంక్రమించకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో అనిల్ కుమార్ రెడ్డి, ఉపాధ్యాయులు, వైద్యులు పాల్గొన్నారు.

### లింకు ద్వారా రూ.22 లక్షల 30 వేలు

## మోసపోయిన బాధితుడు

**అలంపూర్ సెప్టెంబర్ 9, ప్రభాతవార్త :** ఓ లింకు ద్వారా ఓ బాధితుడు రూ.22లక్షల 30040లు పోగొట్టుకోవడం జరిగిందని ఉండవెల్లి ఎస్ఐ శేఖర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం ఇటుకలపాడు గ్రామానికి చెందిన వెంకటేశ్వర రెడ్డి, రెండు సంవత్సరాల నుండి షేర్ మార్కెట్లో ఇన్వెస్ట్మెంట్ చేస్తూ ఉన్నాడని, 25.6.2025 ఫిర్యాదుదారునికి ఉన్న ఫోనుకు వాట్సప్ ద్వారా లింకు లింకు రావడం జరిగిందని అన్నారు. ఫిర్యాదుదారుడు వెంకటేశ్వర రెడ్డి నుండి షేర్ మార్కెట్లో ఇన్వెస్ట్మెంట్ చేస్తూ ఆ లింకు ఓపెన్ చేయగా జి ఆర్ ఓ డబ్ల్యు డబ్ల్యు అనే వెబ్సైట్లో ఇన్వెస్ట్మెంట్ చేస్తే ఎక్కువ అమౌంట్ వస్తుంది అని చెప్పగా ఫిర్యాది అమౌంట్ను ఇన్వెస్ట్ చేశాడు మొత్తం తొమ్మిది విడతలుగా రూ.22లక్షల 30వేల 40 రూపాయలు ఇన్వెస్ట్మెంట్ చేశాడన్నారు. ఇట్టి డబ్బులు డ్రా చేసుకోవడానికి ప్రయత్నించగా అమౌంట్ డ్రా కాలేదు. ఇట్టి డబ్బును డ్రా చేసుకోవాలంటే 13 లక్షలు టాక్స్ కట్టాలని వివరించగా ఫిర్యాదు మోసపోయానని తెలిసి సైబర్ క్రైమ్ నందు కంప్లైంట్ చేయడం జరిగిందని ఫిర్యాదుని మోసగించిన గుర్తుతెలియని వారిపై చట్టరీత్యా చర్య గురించి దరఖాస్తు చేయగా ఉండవెల్లి ఎస్సై. శేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

## విద్యార్థుల్లో సృజనాత్మకత, నైతిక విలువలు నేర్పించాలి

**విద్యార్థులకు స్వేచ్ఛాయుతమైన వాతావరణంలో విద్యనందించాలి**

**విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు బాక్సుల్లో వేయాలి**

**మహాత్మ జ్యోతి బాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులతో కలిసి**

**మధ్యాహ్న భోజనం చేసిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి, సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** విద్యార్థుల పట్ల ఆప్యాయత, అనురాగాలతో వ్యవహరించి స్వేచ్ఛాయుతమైన వాతావరణంలో విద్యనందించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం వనపర్తి మండలం చిట్యాల గ్రామ సమీపంలో ఉన్న మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల సమస్యలను తెలుసుకుని పరిష్కరిం చేందుకు విద్యార్థులతో ముచ్చటించారు. చిన్న చిన్న సమస్యలు మాత్రమే ఉన్నాయని వాటిని పరిష్కరించడంతో పాటు విహారయాత్ర లకు తీసుకువెళ్ళడం, తరచుగా క్రీడలు ఆడించడం వంటివి చేయాలని విద్యార్థులు కోరారు. స్పందించిన కలెక్టర్ ఉపాధ్యాయులతో మాట్లాడి అన్ని సమస్యలు పరిష్కరిస్తానని విద్యార్థులకు భరోసా కల్పించారు. పాఠశాలలో విద్యార్థులకు ఏ సమస్య వచ్చిన ఏర్పాటు చేసిన ఫిర్యాదు బాక్సులో వేయాలని సూచించారు. అనంతరం గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. విద్యార్థుల పట్ల నిబద్ధతతో వ్యవహరించాలని, విద్యార్థులకు నాణ్యమైన బోధనతో పాటు ప్రేమ అభిమానం చూపించాలని ఆదేశించారు. క్రీడల్లో రాణించే విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టిపెట్టి వారిని జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రావడానికి సహకరించాలన్నారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులతో కలిసి సహపంక్తి మధ్యాహ్న భోజనం చేశారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. శ్రీనివాసులు, సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణయ్య, తహసిల్దార్ రమేష్ రెడ్డి, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

### 'పాలమూరు'ను

# పడావు పెట్టిండ్రు..

- గతంలో 90 శాతం పనులు పూర్తి చేశాం
- మిగిలిన 10శాతం పనులు చేయలేరా
- అనుమతులు లేకుండానే నారాయణపేట-కొడంగల్ ప్రాజెక్టు ప్రారంభం
- 8లక్షల ఎకరాలకు నీళ్లిచ్చిన ఘనత కేసీఆర్‌ది
- పాలమూరు ప్రజల సమస్యలపై త్వరలోనే కార్యాచరణ
- గద్వాల ఎమ్మెల్యే అటో.. ఇటో తెల్వదు
- మీడియా సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు9, ప్రభాతవార్త:** ఉమ్మడి పాలమూరును సస్యశ్యామలం చేయాలని మరో కోనసీమలా మార్చాలని, కేసీఆర్ హయాంలో కేఎల్ఐ, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులను పూర్తి చేసి, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను 90శాతం పూర్తి చేశామని, మరీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ఏ సమావేశానికి వెళ్ళినా.. నేను పాలమూరు బిడ్డను.. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయకుంటే చరిత్ర నన్ను క్షమించదు అంటాడు. 22 నెలలు అవుతున్నా పాలమూరు -రంగారెడ్డి ప్రాజెక్టు పనులను పూర్తి చేయకుండా ఎందుకు పడావు పెట్టారో..!? చెప్పాలని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో మాజీ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికలలో ఈ ప్రాంత బిడ్డ ముఖ్యమంత్రి అయితే ఆరు గ్యారెంటీలు అమలు అయ్యి మా సమస్యలు పూర్తిగా తీరుతాయి.. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులు పూర్తి అవుతాయని.. ఆశించారు. అందుకే ఉమ్మడి పాలమూరు జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాలకు.. 12 స్థానాలలో మీ పార్టీ అభ్యర్థులను గెలిపించి.. అధికారాన్ని కట్టబెట్టడంలో కీలక పాత్ర పోషించారు. మరి ఈ 22 నెలల కాలంలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును పడావు పెట్టడంలో ఆంతర్యం ఏమిటి అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ కోసం మీ మామగారు జైపాల్ రెడ్డి చేసిన పోరాటాలు ఏమిటో..!? పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుతో ఆయనకున్న సంబంధం ఏమిటో ..? ప్రజలకు తెలుసు. అరపైసా పనులు కూడా చేయకుండా ప్రాజెక్టుకు మాత్రం జైపాల్ రెడ్డి పేరు పెట్టారు. మీ మామగారి పేరు పెట్టి కూడా పనులను ఆపేశారు. కేసీఆర్ హయాంలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించి 90 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన 10 శాతం పనులను పూర్తిచేయకుండా పడావు పెట్టి.. ఈ ప్రాంత ప్రజల నోళ్లల్లో మన్ను కొడుతున్నారు అని కేటీఆర్ ఆరోపించారు. కేఎల్ఐ, భీమా, నెట్టెంపాడు ప్రాజెక్టులను పూర్తి చేసి ఎనిమిది లక్షల ఎకరాలకు సాగునీటిని అందించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికి దక్కింది అన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేస్తే ఆ పేరు కేసీఆర్ కు వస్తుందని భావించి పనులు నిలిపివేశారని కేటీఆర్ ఆరోపించారు. కాళేశ్వరానికి సంబంధించి 85పిల్లర్లలో రెండు పిల్లర్లు కూలిపోతే.. లక్ష కోట్ల అవినీతి – మిగతా4లో..



స్వామివారి రథాన్ని లాగుతున్న భక్తులు

## వైభవంగా రథోత్సవం

**అగ్నిగుండంలో నడిచిన శివ భక్తులు..**

**తీర్థావళితో ముగిసిన ఉత్సవాలు**

**చిన్నచింతకుంట, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** మండలంలోని లాల్ కోట గ్రామంలో శనివారం నుంచి ప్రారంభమైన శ్రీ ఆంజనేయ, ఈశ్వర, వెంకటేశ్వర స్వామి వార్ల ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగాయి. మంగళవారం తెల్లవారుజామున శ్రీ ఆంజనేయ స్వామి రథోత్సవానికి అందమైన పూలతో అలంకరించి స్వామివారి ఉత్సవ విగ్రహాలను రథంలో ఉంచి భక్తుల గోవింద నామ స్మరణతో శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి భక్తులు స్వామివారి రథాన్ని లాగుతూ ముందుకు సాగారు. వీరశైవ లింగాయత్ లు నందికోల సేవ కొనసాగింది. అడుగడుగునా భక్తులు స్వామివారి రథాన్ని లాగేందుకు పోటీపడ్డారు. అక్కడి నుంచి స్వామి వారి రథోత్సవాన్ని శివాలయంకు రాగానే పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు శివాలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఉపవాస దీక్షలతో – మిగతా4లో..



వసతి గృహంలో కిచెన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

### వసతి గృహాల్లో

## మరమ్మతులు చేపట్టాలి

**బాలికలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి**

**గోపాల్పేట మండలం బిసి బాలికల వసతి గృహాన్ని**

**ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త:** జిల్లాలోని వసతిగృహాల్లో ఉంటున్న బాలికలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్‌సురభి ఆదేశించారు. మంగళవారం గోపాలపేట మండల కేంద్రంలో ఉన్న బిసిబాలికల వసతిగృహాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. వసతిగృహంలో ఉన్న సమస్యలను హాస్టల్‌వార్డెన్ జీవితను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల కురిసిన భారీవర్షాలకు వసతి గృహంలో వర్షం నీరు చేరి ఇబ్బందులు కలిగా యని వార్డెన్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ప్రహరీగోడ నిర్మాణం, మౌలిక వసతులు కల్పించాలని ఆమె కోరారు. స్పందించిన కలెక్టర్ వసతి గృహంలో శిథిలావస్థలో ఉన్న సమస్యలతోపాటు మౌలిక సదుపాయాలు, ప్రహరీ గోడ నిర్మాణం వంటి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వాలని ఆదేశించారు. విద్యార్థులకు భోజనం విషయంలో నాణ్యత పాటించాలని, అదేవిధంగా పరిసరాల పరిశుభ్రత నిరంతరం పాటించాల్సిందిగా ఆదేశించారు. ఎంపీడీవో భావన, ఎమ్మార్వో పాండు, హాస్టల్ వార్డెన్ జీవిత తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.



కాళోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, జిల్లా అధికారులు

## ప్రజా కవి కాళోజీకి ఘన నివాళి

**మహబూబ్‌నగర్, సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** ప్రజా కవి, పద్మవిభూషన్ కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో ఆయన చిత్ర పటానికి జిల్లా కలెక్టర్ విజయేందిర బోయిపూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనపై కలం ఎక్కుపెట్టిన ప్రజాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు తెలంగాణ ప్రాంతానికి చేసిన సేవలు కొనియాడారు. కాళోజీ తెలుగు, ఉర్దూ హిందీ, మరాఠీ, కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో అనేక రచనలు చేసి ఖ్యాతి గడించారు. తన కవితల ద్వారా పేదలు, తెలంగాణ ప్రజల ఆవేదన, ఆగ్రహాన్ని ప్రపంచా నికి చాటిచెప్పారని అన్నారుకాళోజీ నారాయణ రావు రాసిన నా గొడవ సంకలనంలో సమకాలీన సామాజిక సమస్యలను ఏకరువు పెట్టారు. ఆంధ్ర సారస్వత పరిషత్ వ్యవస్థాపక సభ్యుడిగా, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి సభ్యుడిగా కూడా సేవలందించారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ డా. ఏనుగు నరసింహారెడ్డి, గృహ నిర్మాణం శాఖ పిడి వైద్యం భాస్కర్, కలెక్టరేట్ ఏవో సువర్ణరాజ్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## చర్లకోల శ్వేతారెడ్డి విగ్రహావిష్కరణ

### హాజరైన కేటీఆర్, హరీష్ రావు

**నాగర్‌కర్నూల్, సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** మాజీ మంత్రులు, తాజా మాజీ ఎమ్మె ల్యేలు, కార్పొరేషన్ల చైర్మన్లు, వేలాదిమంది మాజీ మంత్రి లక్ష్మారెడ్డి అభిమానులు, నియోజకవర్గంతో పాటు ఉమ్మడి జిల్లా పార్టీ నేతలు, నాయకులు, కార్యకర్తలతో అవంచ గ్రామం జనసంద్రమైంది. కీ.శే. చర్లకోల శ్వేత ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆవంచలో నిర్వహించిన విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు హాజరయ్యారు. మాజీ మంత్రి, బిఆర్ఎస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు డా.సి.లక్ష్మారెడ్డి సతీ మణి కీ.శే.చర్లకొల శ్వేత ప్రథమ వర్ధంతి సందర్భంగా వారి స్వగ్రామం నాగర్ కర్నూల్ జిల్లా తిమ్మాజీ పేట మండలం ఆవంచ గ్రామంలో విగ్రహావిష్కరణ చేశారు. శ్వేతవిగ్రహానికి పూలమాలవేసి, పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం ఆవంచ గ్రామంలో వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వందలాదిమంది కార్యకర్తలు, అభిమానులు అశేష జన వాహిని గ్రామస్తుల మధ్య అశ్రు నయానాలతో శ్వేత విగ్రహం వద్ద – మిగతా4లో..



శ్వేతా విగ్రహావిష్కరణలో పాల్గొన్న కేటీఆర్, హరీష్ రావు

# మండుటెండలో యూరియా కోసం రైతుల తంటాలు



ఊట్కూర్‌లో యూరియా కోసం వేచి ఉన్న రైతులు

**ఊట్కూర్, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** ఊట్కూరు మండల కేంద్రంలో మండుటెండలో రైతులు యూరియ కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పగలు ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నప్పటికీ రైతులు ఉదయం నుంచి రాత్రివేళల వరకు ఎరువుల కోసం క్యూలలో నిలబడే పరిస్థితి నెలకొంది. రైతుల వాణి ప్రకారం ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం వద్ద యూరియ బస్తాల కొరత తీవ్రంగా ఉందని, ఒక్కో పాస్ పుస్తకానికి కేవలం రెండు బస్తాలకే పరిమితం చేయడం వల్ల పెద్ద ఎకరాలు ఉన్న రైతులు మరింతగా ఇబ్బందులు పడుతున్నారని వెల్లడించారు. కనీసం తాగునీటి సౌకర్యం, విశ్రాంతి కోసం నీడ కూడా లేని కారణంగా రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "ఎరువుల కొరతతో పంటలు ఎండిపోతున్నాయి, ఇక మాకు కనీస సౌకర్యాలు కూడా ఇవ్వకపోవడం చాలా బాధాకరం" అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే సరిపడా యూరియ బస్తాలను అందించడంతో పాటు రైతుల కోసం తాత్కాలిక సౌకర్యాలు కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

### యూరియా కోసం భారీగా తరలివచ్చిన రైతులు

**క్యూ లైన్‌లో లేకుండా**

**క్రమబద్ధీకరణ చేసిన మండల వ్యవసాయ అధికారి**



సింగిల్ విండో కార్యాలయం వద్ద రైతుల నుంచి పేపర్లు స్వీకరిస్తున్న మండల వ్యవసాయ అధికారి రమేష్

**ఉప్పునుంతల, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** యూరియా కోసం మండలం నుంచి వివిధ గ్రామాల రైతులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మంగళవారం మండల వ్యవసాయ అధికారి కొర్ర రమేష్ విక్రయ కేంద్రాల వద్ద రైతులు క్యూ లైన్‌లో లేకుండా స్థానిక ఎస్సై వెంకట్ రెడ్డి సహకారంతో పోలీసు బందోబస్తు మధ్య విక్రయ కేంద్రాల వద్ద రైతుల నుంచి కావలసిన పేపర్లు తీసుకొని క్యూ లైన్ లో నిలబడకుండా క్రమబద్ధకరించారు. యూరియా కోసం క్యూ లైన్ లో నిలబడి రైతులు ఇబ్బందులు పడకుండా మండల వ్యవసాయ అధికారి కొర్ర రమేష్ రైతుల నుంచి పేపర్లు స్వీకరించి నేరుగా రైతులను పిలిచినప్పుడు వచ్చి యూరియా తీసుకపోవాల్సిందిగా సూచిస్తూ రైతులకు అవగాహన కల్పించారు. కావలసిన రైతులు విక్రయ కేంద్రాల వద్ద ఎక్కువసేపు ఉండకుండా నివారించగలిగారు. రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన అవసరంలేదని, కావలసినంత యూరియా ఉన్నప్పటికీ రైతులకు అపనమ్మకంతో విక్రయ కేంద్రాల వద్ద ఎగబడుతున్నారని, అలా కాకుండా రైతుల వద్ద పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ జిరాక్స్ తీసుకొని నేరుగా రైతును పిలవడం జరుగుతుందని ఎఓ వివరించారు. మొత్తం మీద మంగళవారం మండల కేంద్రమైన ఉప్పునుంతల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం వద్ద, ఆగ్రో రైతు సేవా కేంద్రం వద్ద నిర్వహించిన యూరియా పంపిణీ చేయడం ,రైతులు ఇబ్బందులు పడకుండా మండల వ్యవసాయ అధికారి రమేష్ తీసుకున్న నిర్ణయం పట్ల చాలా మంచిదని రైతులు అభినందించారు. తమ పేరు వచ్చినప్పుడు కేంద్రం వద్దకు వెళ్లి యూరియా తీసుకుంటున్నామని యూరియా కోసం వచ్చిన రైతులు వారి అభిప్రాయం వ్యక్తం చేశారు.

## యూరియా అందుబాటులో ఉంది



రైతులకు యూరియాను అందజేస్తున్న అధికారులు

**అలంపూర్ సెప్టెంబర్ 9, ప్రభాతవార్త:** రైతులకు ఎలాంటి యూరియా కొరత లేదని సంబంధిత పిఎసిఎస్‌లాలో నిలువ ఉంచడం జరిగిందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్ అన్నారు. మంగళవారం రోజు అలంపూర్ మండల పరిధిలోని క్యాతూర్ పీఏసీఎస్ కేంద్రంలో పరిశీలించిన అనంతరం, జిల్లా అధికారి మాట్లాడుతూ, క్యాతూర్ సింగిల్ విండో కేంద్రంలో 450 బస్తాల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు.ఇప్పటివరకు ఈ కేంద్రంలో 4150 బస్తాలు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. అలాగే రైతులకు నానో యూరియా పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అలంపూర్ మండల వ్యవసాయ అధికారి నాగార్జున రెడ్డి, సీఈఓ హుస్సేన్, విస్తరణ అధికారులు సాయిరాం, మానస, నీలిమ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలతో సద్వినియోగం చేసుకోండి

**ఆత్మకూర్ సెప్టెంబర్ 9, ప్రభాతవార్త :** ఈనెల 13న ఆత్మకూర్ మున్సు మేజిస్ట్రేట్ కోర్టు పరిధిలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకునేందుకు సద్వినియోగం చేసుకోవాలని ఆత్మకూర్ ఎస్పై నరేష్ విలేకరులకు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన పోలీస్ స్టేషన్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా కోర్టులో పెండింగ్లో ఉన్నటువంటి కేసులను పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్ అదాల ఉత్తమమైన మార్గమని ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేందుకు పోలీసు శాఖ ద్వారా అన్ని రకాల సహాయ సహకారాలు అందించినట్లుగా ఆయన తెలిపారు. జాతీయ లోక్ అదాలతో రాజీమార్గం కావాలనుకునేవారు ఆత్మకూరు పోలీస్ స్టేషన్ను రెండు రోజుల ముందుగానే సంప్రదించి కేసర వివరాలను పరిష్కరించుకోవాల్సిందిగా ఆయన సూచించారు..

## ఫిషరీస్ ఎక్స్‌పోర్టు సెంటర్‌కు స్థల సేకరణ చేసిన తహసీల్దార్ మురళిగౌడ్


ఫిషరీస్ ఎక్స్‌పోర్టు స్థల సేకరణ చేస్తున్నా తహసీల్దార్ మండల కాంగ్రెస్ నాయకులు

**పెబ్బేరు,సెప్టెంబరు 9 ప్రభాతవవార్త :** పెబ్బేరు మండలం తోమాలపల్లి గ్రామ శివారులో సర్వే నెంబర్ 104 లో ప్రభుత్వ భూమిని మంగళవారం స్థానిక తహసిల్దార్ మురళిగౌడ్, మండల కాంగ్రెస్ నాయకుల కలిసి స్థల సేకరణ పరిశీలించారు. పెబ్బేరు మహిళా సమాఖ్య,మహిళా అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ వేయడానికి స్థల సేకరణ,అలాగే జాతీయ రహదారిపై 45 కోట్లతో ఫిషరీస్ ఎక్స్పోర్ట్ సెంటర్ ఏర్పాటు చేయడానికి స్థల సేకరణ చేశామని తహసిల్దార్ మురళి గౌడ్,జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్య క్షులు శ్రీనివాస్ గౌడ్ తెలియజేశా రు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ పెబ్బేరు మండల అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న ఎమ్మెల్యే మెఘా రెడ్డికి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఇందిరా,మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, నాయకులు పురు రమణ, రామన్ గౌడ్, యుగంధర్ రెడ్డి, రణధీర్ రెడ్డి,రాములు, వడ్డే అంజి,మిర్చి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

**గండీడ్ సెప్టెంబర్ 9, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన గండీడ్ మండలం రంగారెడ్డి పల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాల్ రాజ్ గౌడ్ ను మంగళవారం గండీడ్ మండల కేంద్రంలోని స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఎంఈఓ రుద్రారం జనార్ధన్ తోపాటు పలు విద్యాసంఘాల నాయకులు, పలు పాఠశాలల ఉపాధ్యాయులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సల్కర్ పేట్ కాంప్లెక్స్ జిహెచ్ఎం విజయలక్ష్మి ్మ, పి.ఆర్.టి.యు.టి.ఎస్ మండల అధ్యక్షులు ఎ.శ్రీనివాస్ రెడ్డి, టి.ఎస్.యు.టి.ఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి పగిడ్యాల్ బోరు కృష్ణయ్య, పి.ఆర్.టి.యు తెలంగాణ మండల అధ్యక్షులు జి.మహిపాల్ రెడ్డి, టి.జి.యు.ఎస్ మండల అధ్యక్షులు లావుడ్యా రవీందర్, కొమిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు లావుడ్యా సేవియా, బస్సురుగొండ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు లావుడ్యా కిషన్, సల్కర్ పేట్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్, గండీడ్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, చిన్న వార్వాల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అంగడి అరుణ దేవి, వెన్నచేడ్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల, కాంప్లెక్స్ మీటింగుకు వచ్చిన ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## రెడ్డి సేవా సమితి నర్వ మండల కమిటీ ఎన్నిక

**మండల అధ్యక్షులుగా యం.రవీందర్ రెడ్డి**

**నర్వ, సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** రెడ్డి సేవా సమితి నర్వ మండల నూతన కమిటీని మంగళవారం నర్వమండల కేంద్రంలోని జలంధర్ రెడ్డి నివాసంలో ఆ సంఘం జిల్లా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నర్వమండల రెడ్డిసేవాసమితి అధ్యక్షులుగా నర్వ గ్రామ నివాసి అయినా మాదిరెడ్డి రవీందర్‌రెడ్డిని ఎన్నుకోవడం జరిగిందని రెడ్డి సేవసమితి జిల్లా కార్యవర్గ సభ్యులు వావిళ్ళ నరేందర్‌రెడ్డి తెలిపారు.ఈసందర్బంగా నర్వ నూతనఅధ్యక్షులు రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ సంఘం అభివృద్ధితోపాటు రెడ్డిల అభివృద్ధికి నావంతు కృషిచేస్తాను అన్నారు.అనంతరం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మాదిరెడ్డి రవీందర్ రెడ్డిని నర్వ గ్రామ రెడ్డి సంఘం తరపున శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సేవ సమితి నర్వ గ్రామ రెడ్డి సంఘం సభ్యులు మాదిరెడ్డి శశింధర్ రెడ్డి, తిలేటి శ్రీనివాస్ రెడ్డి, రాఘవ రెడ్డి, వావిళ్ళ రవి కుమార్ రెడ్డి, ఎనుముల రాఘవేందర్ రెడ్డి ,అరగిద్ద తిరుపతి రెడ్డి, మాదిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మాదిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, సద్దలి సత్యనారాయణ రెడ్డి, యాంకి చిన్నారెడ్డి,వావిళ్ళ మధుసూదన్ రెడ్డి, ఏనుముల రాజారెడ్డి, యాంకి భాస్కర్ రెడ్డి, తిలేటి సురేందర్ రెడ్డి, మెట్ల శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలు

**నారాయణపేట, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** నారాయణ పేట పట్టణ కేంద్రంలోని చిట్టెం నర్సిరెడ్డి స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు విభాగం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఈ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయికార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డా. మెర్సీ వసంత మాట్లాడుతూ కాళోజి నారాయణరావు జన్మదినాన్ని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకోవడం ప్రతి ఒక్కరికీ గర్వకారణం మన భాష, మన సంస్కృతి మన అస్తిత్వాన్ని తెలియజేస్తాయి. విద్యార్థులు తెలుగు భాష పట్ల మరింత అభిరుచి పెంపొందించుకోవాలి వ్యాసరచన,ఉపన్యాస పోటీలు,సాహిత్య సదస్సులు వంటి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలి అని కాళోజి సాహిత్యం, ఆయన రచనల్లోని స్ఫూర్తిదాయకమైన అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కాళోజి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు భాస్కర్ రెడ్డి, డా.శంకర్, జి.శ్రీనివాస్, తెలుగు విభాగాధిపతి అశోక్, కె.ప్రకాష్, పి.వెంకటయ్య, విశ్వనాథ్, నిర్మల, సంగీత, డా.కవిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

**మున్సిపల్ కమిషనర్ శశిధర్**

**ఆత్మకూర్ సెప్టెంబర్ 9, ప్రభాతవార్త :** ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో కుక్కకాటుకు బలికాకుండా ప్రజలను కాపాడే కార్యక్రమాన్ని వీధి కుక్కల నియంత్రణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లుగా ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ చెక్కి శశిధర్ వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నటువంటి 100 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం రోజు పట్టణంలోని దాదాపు 43 కుక్కలను మున్సిపల్ సిబ్బంది ద్వారా పట్టించి జనం నియంత్రణ ఇంజక్షన్లను ఇప్పిచ్చినట్లుగా ఆయన తెలిపారు. వీధి కుక్కలతో పాటుగా పెంపుడు కుక్కలను సంరక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని అందులో భాగంగానే భవిష్యత్తులో కుక్కల బెడద రాకుండా జనన నియంత్రణ ఇంజక్షన్ లో వాడి కుక్కల ఎదుగుదలను అడ్డుకుంటున్నట్లుగా ఆయన తెలిపారు. మున్సిపల్ సిబ్బంది చేపడుతున్న చర్యలకు పట్టణ ప్రజలు సంపూర్ణ సహాయ సహకారాలు అందించి వీధి కుక్కల భారీ నుండి రక్షించే కార్యక్రమాలకు తోడ్పాటున అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## న్యాయవాదిపై దాడికి నిరసనగా విధుల బహిష్కరణ

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** మేడ్చల్‌లో సోమవారం న్యాయవాది సురేష్ పై రౌడీ షీటర్ దాడి చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం నారాయణపేట జిల్లా కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ గౌడ్, ఉపాధ్యక్షుడు నందు నామాజీ, ప్రధాన కార్యదర్శి చెన్నారెడ్డి, కార్యదర్శి అమిరోద్దిన్, కోశాధికారి కృష్ణ య్య గౌడ్ మాట్లాడుతూ న్యాయం కోసం పోరాడుతున్న న్యాయవాదులపై ఈ మధ్య కాలంలో దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకు రావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

# వనపర్తి జిల్లాలో యూరియా కొరత లేదు

**రైతులకు ప్రస్తుత అవసరాల మేరకు ఇవ్వండి**

**ఇతర జిల్లాల రైతులు సైతం యూరియా కోసం వస్తున్నారు**

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**


రైతులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి, సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లాలో గత సంవత్సరం కంటే ఎక్కువ యూరియా అందుబాటులో ఉందని, రైతులు అపోహలు పడొద్దు అని, పంటకు రెండవసారి వేయాల్సిన యూరియా సైతం ఇప్పుడే కొని పెట్టుకోవాలి అనుకోవడం వల్ల మిగతా రైతులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. మంగళవారం గోపాల్పేట మండలం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంతో పాటు శ్రీ సాయి ఫెర్టిలైజర్స్ సీడ్స్ గోదామును కలెక్టర్ తనిఖీ చేశారు. రికార్డుల ప్రకారం, వాస్తవిక యూరియా నిల్వలను పరిశీలించారు. పి. ఏ.సి.ఎస్ చైర్మన్లు సకాలంలో యూరియా కొరకు డి.డి.లు కట్టి రైతులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం అక్కడే రైతులతో మాట్లాడారు. అందుబాటులో ఉన్న యూరియా రైతులకు సక్రమంగా పంపిణీ చేయాలని వ్యవసాయ, సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. వనపర్తి జిల్లాలో గత సంవత్సరం కంటే ఎక్కువ యూరియా వినియోగిస్తున్నారని అన్నారు. మళ్ళీ యూరియా దొరుకుతుందో లేదో అనే భయాందోళనలు పడొద్దని రైతులకు సూచించారు. కొంతమంది రైతులు ప్రస్తుత అవసరానికి మించి కొనడం వల్ల ఇతర రైతులకు ఇబ్బందులు కలుగుతుందన్నారు. రెండో దఫా వేయాల్సిన యూరియా సైతం ఇప్పుడే కొని పెట్టుకోవడం సరి కాదన్నారు. యూరియా పంపిణీ నిరంతర ప్రక్రియ కాబట్టి రైతులు అనవసరంగా ఆందోళన పడి ఉదయాన్నే లైన్లో వేచి ఉండాల్సిన పని లేదన్నారు. జిల్లాలో గత సంవత్సరం ఇంతక న్నా తక్కువ యూరియా ఉండిందని కానీ ఎక్కడ సమస్య తలెత్తలేదన్నారు. ఇప్పుడు ఎంత అవసరమో అంత మాత్రమే తీసుకెళ్లాలని తర్వాత మళ్ళీ తీసుకోవచ్చని రైతులకు భరోసా కల్పించారు. ప్రస్తుతం గోపాల్పేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లో 54 మెట్రిక్ టన్నుల యూరియా ఉందన్నారు. రైతులు ఎక్కువమంది రావడంతో నాలుగు స్టాక్ పాయింట్లు ఏర్పాటుచేసి పంపిణీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు గౌడ్, గోపాల్పేట తహసీల్దార్ పాండు, ఎంపీడీవో భావన, ఎంఈఓ కరుణశ్రీ రైతులు కలెక్టర్ వెంట ఉన్నారు.


శ్రీ సాయి ఫెర్టిలైజర్స్ సీడ్స్ గోదామును తనిఖీ చేస్తున్న కలెక్టర్

## తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఇల్లు నిర్మించుకోవాలి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బి.ఎం.సంతోష్

**ఆలంపూర్ సెప్టెంబర్ 9, ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఇళ్లు నిర్మించగలిగేలా సలహాలు ఇచ్చి,పనులను త్వరగా పూర్తిచేయాలని జిల్లాకలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులను ఆదేశించారు.మంగళవారం అయిజ మున్సిపల్ పరిధిలోని వార్డ్ నం.6లో ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద మంజూరైన లబ్ధిదారులు చేపట్టిన ఇండ్ల నిర్మాణాలను తనిఖీ చేశారు.ఇంటి నిర్మాణం,పనులలో నాణ్యతను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఇందిరమ్మ ఇళ్లలో మొత్తం 12 ఇళ్లకు మంజూరు అయినట్టు అందులో 5 రూఫ్ లెవెల్,7బేస్మెంట్ లెవెల్ ఉన్నట్లు అధికారులు కలెక్టర్‌కు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లాకలెక్టర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మఇండ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసేలా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.హౌసింగ్ ఇంజినీర్లు,అధికారులు లబ్ధిదారులను తక్కువ ఖర్చుతో,నాణ్యమైన ఇళ్లను నిర్మించడానికి అవసరమైన సలహాలు ఇవ్వాలన్నారు. లబ్ధిదారులు త్వరితగతిన ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవడానికి ప్రభుత్వ నిధులను ఎప్పటికప్పుడు డబ్బులు వారి ఖాతాకు జమ చేయాలని కలెక్టర్ తెలిపారు.ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందిస్తుందని, లబ్ధిదారులు కేవలం కూలీ మరియు రవాణా చార్జీలను మాత్రమే చెల్లించవలసి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు.ఇసుక,మట్టి కొరత లేకుండా అందుబాటులో ఉండేలా అధికారులను చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లా కలెక్టర్ లబ్ధిదారుల నుండి ఇళ్ల నిర్మాణానికి ఏమైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకొని, పనులను వేగంగా పూర్తి చేయాలని,దశలవారీగా డబ్బులు ఖాతాలో వెంటనే జమ చేస్తామని తెలిపారు.ఈ కార్యక్ర మంలో మున్సిపల్ కమిషనర్ సైదులు,మున్సిపల్ మేనేజర్ అశోక్ రెడ్డి, హౌసింగ్ ఎ.ఈ వంశీ,వార్డ్ ఆఫీసర్ భరత్,తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్ ద్వారనే సత్వర న్యాయం

**"జాతీయ మెగా లోక్ అదాలత్"ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోండి : ఎస్పీ**


జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ (ఫైల్)

**వనపర్తి,సెప్టెంబరు9 ప్రభాతవార్త:** వివాదాలు అనేవి పెంచుకోవాలనుకుంటే జీవితకాలం కొనసాగుతాయి. ఒకవేళ ఇంతటితో కలిసుంటామని ఒక నిర్ణయానికి వస్తే అప్పుడే సమసిపోతాయని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉచిత న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్13వ తేది వరకు వనపర్తి జిల్లా కోర్టులలో "జాతీయ మెగా లోక్ అదాలత్" సందర్భంగా కక్షిదారులకు పోలీసులు అందుబాటులో ఉంటారని జాతీయ మెగా లోక్అదాలత్ ఉన్నందున రాజీ పడ దగిన కేసులలో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన నిర్వాహణ కేసులు, రోడ్డు ప్రమాదాల కేసులు, చిన్న చిన్న దొంగతనాల కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ టౌన్ న్యూసెన్స్ కేసులు, బ్యాంకు రికవరీ, టెలిఫోన్ రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ కేసులో ఇతర రాజీ పడ్డ దగిన కేసుల్లో కక్షి దారులు రాజీ పడాలని సూచించారు. రాజీ మార్గం రాజ మార్గమని చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని డబ్బులను వృధా చేసుకోవద్దని, న్యాయస్థానం ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పోలీస్ అధికారులు కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్ లు పోలీస్ సిబ్బంది రాజీ పడ్డ దగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పించాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుందని బాధితులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## సొసైటీలో జరిగిన అవినీతిపై విచారణ జరపాలని డిమాండ్

**జోలి శాఖ రాష్ట్ర జైంట్ డైరెక్టర్ సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ నాయకుల వినతి**

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** సొసైటీలో జరిగిన అవినీతిపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హైదరాబాద్ చేనేత భవన్ జోలి శాఖ జాయింట్ డైరెక్టర్ ను సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ టియుసిఐ జిల్లా నాయకుడు కెంచే నారాయణ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ జిల్లా నాయకులు ఎం. కాలేశ్వర్ కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారాయణపేట పట్టణంలో ఉన్న హెచ్ డబ్ల్యూ సి ఎస్ సొసైటీలో 4267 మంది చేనేత కార్మికులతో సొసైటీ ఏర్పడడం జరిగింది. ఇప్పుడు 72 మంది కార్మికుల మొత్తం మంది కార్మికులకు సొసైటీలో సభ్యత్వం ఇవ్వాలని అదేవిధంగా గాంధీనగర్ 100 మందికి సభ్యత్వం తీసుకొని ఇండ్ల రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని మెమరండం లో పేర్కొనడం జరిగిందన్నారు. 2009 నుండి 2024 వరకు జిల్లా సహకారా కార్యాలయము సమాచారం చట్టం ద్వారా తీసుకోవడం జరిగిందన్నారు. అందులో భయంకరమైన నిజాలు బయటపడ్డాయి అన్నారు. 12 సంవత్సరాల్లో దాదాపు సొసైటీ ద్వారా కార్మికులకు ఒక్క మొగ్గము సరుకులు ఇవ్వకుండా దాదాపు 72 చేనేత కార్మికులకు ఉపాధి కల్పించకుండా 12 బాగా లావాదేవీలు సంవత్సరాల్లో జమ ఖర్చులు కాటన్ చీరలు సిల్క్ చీరలు యార్న్ కొనుగోలు చేసినట్టు అమ్మినట్టు 29 కోట్లు 18 లక్షల 46వేల 958 రూపాయల లావాదేవీలు జరిగినట్టు ఉన్నదన్నారు.పట్టణంలో చేనేత కార్మికులకు 60 నుండి 80 మొగ్గలు హ్యాండ్లూమ్ ఉన్నాయి. కార్మికులకు త్రిఫ్ట పండు జిఓ టాకింగ్ ద్వారా ప్రధాన కార్మికునికి 1200 రూపాయలు జమ చేయాలి అనుబంధ కార్మికునికి 600 రూపాయలు జమ చేయాలని గతంలో మార్చ్ ఒకటి తారీఖున చేనేత అధికారి ఏడి ఒక ప్రకటనలో తెలపడం జరిగిందని కానీ ప్రధాన కార్మికునికి 1200 చేయడం జరిగింది. అనుబంధ కార్మికునికి 600 చేయకుండా వేరే వ్యక్తులపై త్రిఫ్ట పండు చేయడం జరిగింది అన్నారు. నిజమైన కార్మికులకు అన్యాయం జరిగిందని న్యాయం జరగాలని కోరడం జరిగిందన్నారు. ఈ సమస్య పైన విచారణ జరిపి కార్మికులకు న్యాయం జరపాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ నాయకులు డిమాండ్ చేస్తూ ఈ అవినీతిపై సమగ్ర విచారణ వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు.

## వైశాఖపూర్‌లో పద్మ విభూషణ్ కాళోజి నారాయణరావు జయంతి

**ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం**


కాలేజీ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయ బృందం

**పెబ్బేరు, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలం వై శాఖపురం గ్రామం జిల్లా పరిషత్ హై స్కూల్లో మంగళవారం రోజు పద్మ విభూషణ్ కాళోజి నారాయణరావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రజా కవి ఉద్యమం నడిపిన ప్రజావాది అయినా కాళోజి ప్రజా హక్కుల కోసం పోరాడారని. తెలంగాణ జీవిత చలనశీలి పుట్టుక,చావులు కాకుండా బతుకంతా తెలంగాణకి ఇచ్చిన మహనీయుడు అని స్కూల్ ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో అవా ర్డులు అందు కున్న స్కూల్ ప్రధానోపాధ్యా యుడు మల్లికార్జున్, మ్యాథ్స్ ఉపాధ్యాయులు సురేష్, ఇంగ్లీష్ ఉపా ధ్యాయులు పనిచేస్తున్న ఖయ్యూం మండల స్థాయి అవార్డు వచ్చిన సందర్భంగా ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల ఆధ్వర్యంలో వారికి శాలువా, పులామాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన వనపర్తి జిల్లా టిపియుఎస్ అధ్యక్షులు అమరేందర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్,స్కూలు ఉపాధ్యాయులు విజయ్ కుమార్,రామచంద్రుడు, బలపాల విజయ్,సురేష్,జయప్రకాష్, శ్రీనివాసులు,విశ్రాంత ఉపాధ్యాయులు శేఖర్ విద్యార్థులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.


ఉత్తమ ఉపాధ్యాయునికి ఘన సన్మానం చేసిన ఉపాధ్యాయ బృందం విద్యార్థులు

## విద్యార్థినికి అండగా గ్రామ యువకులు


ఆర్థిక సహాయం అందజేస్తున్న గ్రామ యువకులు

**వడ్డేపల్లి,సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** శాంతినగర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని చరిత గత కొన్నిరోజులుగా తీవ్ర అనారోగ్యానికి గురై హైదరాబాద్ లోని హాస్పిటల్‌లో చికిత్స పొందుతుంది. బిడ్డ ఆరోగ్యానికి సంబంధించి వారి తల్లిదండ్రులు దాతలు ముందుకు వచ్చి తమ బిడ్డను కాపాడవలసిందిగా ఒక వీడియోను వాట్సాప్ గ్రూపులో పోస్ట్ చేశారు. దీంతో స్పందించిన వడ్డేపల్లి మండలం జులేకల్ గ్రామానికి చెందిన యువత రూ.27,200 విరాళాన్ని సేకరించి అట్టి మొత్తాన్ని మంగళవారం గ్రామస్తుల సమక్షంలో విద్యార్థిని కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ యువత మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి అండగా నిలబడడమే మానవత్వమని సాటి మనిషి కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలిస్తే ఆ కుటుంబానికి భరోసా కల్పించిన వారమవుతామని తెలిపారు.

## రాజీమార్గమే రాజమార్గం ఎస్పీ

**నారాయణపేట, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా కేంద్రంలో జాతీయ లోక్ అదాలత్ ద్వారా ప్రజలకు తక్షణ న్యాయం లభించనుందని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ తెలిపారు. వివాదాలు జీవితకాలం కొనసాగకుండా రాజీ మార్గమే రాజమార్గమని ఆయన విజ్ఞప్తి చేశారు. సెప్టెంబర్ 13న నారాయణపేట కోర్టు కోర్టులలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడనుందని ఎస్పీ తెలిపారు యాక్సిడెంట్ కేసులు చిన్న దొంగతనాలు వివాహ సంబంధ సమస్యలు డ్రంక్ అండ్ డ్రైవ్ చీటింగ్ కేసులు తదితర రాజీ పడదగు కేసులు ఈ అదాలత్లో పరిష్కరించుకోవచ్చని చెప్పారు. ఫిర్యాదుదారులు, నిందితులు ఆధార్ కార్డుతో సంబంధిత కోర్టుకు హాజరుకావాలని సూచించారు ఈ అదాలత్ ద్వారా కేసులు ముగించుకునే మంచి అవకాశం ఉందని ఎస్పీ ప్రజలను కోరారు.

## ఊట్కూర్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం


ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం


**ఊట్కూర్, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** ఊట్కూర్ గ్రామపంచాయతీ ప్రాంగణంలో వాకిటి శ్రీహరి సేవాసమితి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని మండల ప్రజాపరిషత్ అధికారి ధనుంజయ గౌడ్, సమితి వ్యవస్థాపకులు ఏ.రవికుమార్ ప్రారంభించారు. రాష్ట్ర మంత్రివర్యులు డా.వాకిటి శ్రీహరి సహకారంతో రామ్ రెడ్డి లయన్స్ హాస్పిటల్ వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించగా, 150 మందికి పైగా పరీక్షలు జరగగా 80 మందికి పైగా కంటి పొరల సమస్యలు గుర్తించారు. వారిని శస్త్రచికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్‌కు తరలించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులు,మండల అధ్యక్షుడు యజ్ఞేశ్వర్‌రెడ్డి,మాజీ సర్పంచ్ సూర్యప్రకాష్ రెడ్డి, కొక్కు లింగం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రజాకవి కాళోజీ జయంతి


కాళోజీ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

**నారాయణపేట, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** నారాయణ పేట మంగళవారం జిల్లా కలెక్టరేట్ ప్రజావాణి హాల్‌లో ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి ఘనంగా నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజేంద్ర గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన కార్యక్రమంలో కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాళోజీ అందించిన సేవలను వక్తలు స్మరించుకున్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ సిబ్బంది, కలెక్టరేట్ స్టాఫ్, వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

## బాలుర హాస్టల్లో హెల్త్ క్యాంప్


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్

**ఊట్కూర్, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** ఊట్కూర్ మండల కేంద్రంలోని బాలుర వసతి గృహంలో ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంతోషి విద్యార్థులందరికీ పూర్తి స్థాయి ఆరోగ్య పరీక్షలు చేశారు. బరువు, ఎత్తు, కంటి చూపు, రక్తపోటు, రక్తహీనత తదితర అంశాలపై సమగ్రంగా పరిశీలించారు.ఆరోగ్య పరీక్షల అనంతరం అవసరమైన మందులు పంపిణీ చేయడంతో పాటు విద్యార్థులకు సమయానికి భోజనం చేయడం, పరిశుభ్రమైన నీరు తాగడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, శుభ్రత పాటించడం వంటి ఆరోగ్య సూచనలు ఇచ్చారు. రక్తహీనత, జలుబు, దగ్గు, చర్మ సంబంధిత సమస్యలు ఉన్న వారికి ప్రత్యేకంగా మందులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎమ్ గోవిందమ్మ, ఆశా వర్కర్లు, హాస్టల్ వార్డెన్ వెంకటేశం, ఉపాధ్యాయులు, గ్రామ ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు. విద్యార్థుల ఆరోగ్య రక్షణ కోసం ఇలాంటి శిబిరాలు చాలా ఉపయోగకరంగా ఉంటాయి. తరచుగా ఇలాంటి కార్యక్రమాలు జరగాలి" అని హాస్టల్ వార్డెన్ వెంకటేశం అన్నారు.

## డిజిటల్ బోధనపై శిక్షణ



ఉపాధ్యాయులకు డిజిటల్ బోధనపై శిక్షణ ఇస్తున్న అధికారులు

**దామరగిద్ద, సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** దామరగిద్ద మండలంలోని జడ్పీహెచ్ఎస్ క్యాతన్ పల్లి పాఠశాలలో మంగళవారం కాంప్లెక్స్ సమావేశం ఎంఈఓ కృష్ణ రెడ్డి , జిహెచ్ఎం సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. సమావేశంలో గణిత పుస్తకంలో పొందుపరిచిన పాఠ్యాంశాల యొక్క డిజిటల్ బోధనపై ప్రాథమిక స్థాయి విద్యార్థులకు కంప్యూటర్ లేదా ట్యాబ్ ద్వారా నిర్వహించవలసిన కృత్యాల ద్వారా విద్యార్థి సామర్థ్యాలను మెరుగుపరిచే విధంగా కృత్యాధార బోధన అమలు చేయాలని, వెనుకబడిన విద్యార్థుల సామర్థ్యాలను అన్ని విషయాలలో మెరుగు పరచడానికి వినూత్న బోధనలను అమలు చేయాలని, ఎఫ్ఎల్ఎన్‌లోని కనీస సామర్థ్యాల సాధనకు ఈ డిజిటల్ బోధన అనేది ఉపయోగపడుతుందని ఆ దిశగా కృషి చేయాలని మండల విద్యాధికారి కృష్ణారెడ్డి హాజరైన ఉపాధ్యాయులకు సూచించడం జరిగింది. అదేవిధంగా ఎస్‌హెచ్‌విఆర్ రేటింగ్ పైన కూడా ఉపాధ్యాయులు సకాలంలో పూర్తి చేయాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమానికి డిఈఓ గోవిందరాజులు హాజరై ఉపాధ్యాయులకు కొన్ని సూచనలు సలహాలు ఇస్తూ ఎఫ్ఎల్ఎన్ యొక్క లక్ష్యాలను అందరూ విద్యార్థులు చేరుకునేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించడం జరిగింది. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, సురేష్, ఉపాధ్యాయులు, ఆర్పీలు డి.నరేష్,ఉసేనప్ప, నరేష్, సిఆర్పీలురాములు, మహిపాల్ పాల్గొన్నారు.

## పంట కోత ప్రయోగాలు సక్రమంగా నిర్వహించాలి

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు9 ప్రభాతవార్త:** పంటకోత ప్రయోగాల డిజిటల్ ఆప్‌పై శిక్షణా తరగతులను మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఎన్ఐసి సమావేశ మందిరంలో ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ ఎస్ఓ, ఏఈఓలు వారికి కేటాయించిన గ్రామాలలో పొరపాటు లేకుండా పంటకోత ప్రయోగాలు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. సేకరించిన వివరాలను సమయానికి డీజీసీఈఎస్ యాప్లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు పంటకోత ప్రయోగములు నిర్వహిస్తున్నప్పుడు ప్రాథమిక కార్యకర్తలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు తెలియజేశారు. సేకరించిన వివరాలను సమయానికి డీజీసీఈఎస్ యాప్లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. పంటకోత ప్రయోగాలు కేవలం ఒక సర్వే కాకుండా,రైతులకు, ప్రభుత్వానికిఉపయోగకరమైన అంచనాలు వేయడానికి ఉపయోగపడతాయని, పంటల దిగుబడి అంచనా వేయడానికి, ప్రభుత్వం వ్యవసాయం, పంటలపై తగు విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడానికి దోహద పడుతుందన్నారు. మార్కెట్ ధరలు, ఎగుమతులు, దిగుమతులు స్థిరంగా ఉండేలా చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వానికి ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ గణాంక అధికారులు నర్సింహులు, రాజేష్, ఎంపిఎస్ఓలు, ఏఈఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఉచిత లివర్ పరీక్ష శిబిరం విజయవంతం

**కల్వకుర్తి, సెప్టెంబర్9 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణానికి చెందిన స్వామివివేకానంద సేవా బృందం ఆధ్వర్యంలో ప్రముఖ ఏఐజీ ఆసుపత్రి సహకారంతో కల్వకుర్తి మండలం తోటపల్లి గ్రామంలో నిర్వహించిన లివర్ పరీక్ష శిబిరం విజయవంతమైంది. శిబిరంలో 120 మంది గ్రామస్థులకు లివర్ స్కానింగ్, రక్త పరీక్షలు నిర్వహించుకొని ప్రత్యేక డాక్టర్లు సూచించిన సలహాలు పాటించాలని, తదనంతరం ఉచితంగా మందులను అందజేశారు. స్వామివివేకానంద సేవా బృందం ఆధ్యక్షుడు శివ కుమార్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని గ్రామాల్లో నిర్వహించడం వల్ల గ్రామాల్లో మద్యానికి బానిసై తెలియకుండా శరీరంలోని లివర్ ఇతర అవయవాలు దెబ్బతింటున్నాయన్నారు. ప్రజల్లో ఆరోగ్య సమస్యలు రాకుండా ముందుగానే వారికి ఇలాంటి శిబిరాలు నిర్వహించడం వల్ల ఆరోగ్యాన్ని జాగ్రత్త పర్చుకోవాలని శివ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య సిబ్బంది డా.రోహిత్ కుమార్, శ్రీదేవి, ప్రసన్న, కీర్తి, మానస, వైభవ్, గురు, నాయకులు మొగిలి దుర్గాప్రసాద్, మట్ట నరేష్ గౌడ్, రమేష్ గౌడ్, కందే ప్రకాష్, లింగారెడ్డి, లక్ష్మారెడ్డి, ఖాజా సేవా బృందం సభ్యులు లక్ష్మి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు సద్వినియోగం చేసుకోండి



స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ బి.రాంరెడ్డి

**నర్వ, సెప్టెంబరు9 ప్రభాతవార్త:** ఉపాధ్యాయులందరు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను సద్వినియోగం చేసుకోవాలని నర్వ ఎంఈఓ బి. రాంరెడ్డి అన్నారు. శుక్రవారం మంగళవారం నర్వ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన ప్రాథమిక పాఠశాలల స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఆయన పర్యవేక్షించారు. ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులందరూ తరగతి గదిలో అనుసరించవలసిన బోధనా పద్ధతులను, బోధనోపకరణాలను తయారు చేసుకుని ప్రదర్శనగా ఉంచాలన్నారు. నూతన బోధనా పద్ధతులను మెరుగుపరుచుకోవడానికి సమావేశాలు ఉపయోగపడతాయన్నారు. మొదటి రోజు కాంప్లెక్స్ మీటింగ్ నర్వ హై స్కూల్ లో జరిగింది.15 తరుగతుల గణితం ఎలా బోధించాలి జి కంప్రీస్ యాప్ ద్వారా విద్యార్థులకు ఆన్లైన్‌లో ఎలా బోధించాలి, యూనిట్ పరీక్ష ఎఫ్ఏ 1,2 పరీక్ష నిర్వహణ,ఆన్లైన్ చేయాల్సిన పద్ధతులను ఎంఈఓ రాంరెడ్డి వివరించారు.ఈ సమావేశాన్నికాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పి.సుజాత ప్రారంభించారు. కార్యక్రమంలో సిఆర్పి నర్సిములు, ఆర్పిలు శివశంకర్,అనిల్ కుమార్,ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్ రెడ్డి, సూరం వెంకటేష్, పద్మాలత, జనార్దన్,ఉస్మాన్‌లు పాల్గొన్నారు.

## కైలాస గుట్టపై హైమక్స్ లైట్లు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు వినతి

**కల్వకుర్తి, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని కైలాసం గుట్టపై విద్యుత్ వైర్లు సరి చేసి హైమాక్స్‌లైట్లు ఏర్పాటు చేయాలని మంగళవారం హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ మహ్మద్‌షేక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హిందూ ఐక్య వేదిక సంఘం నాయకులు మాట్లాడుతూ కైలాసంగుట్టపై త్వరలో వచ్చే విజయదశమి సందర్భంగా బతుకమ్మ పండుగ సంబురాలు, కార్తీక మాసం ప్రత్యేక పూజలు ఉంటాయి కాబట్టి భక్తులకు ఇబ్బందులు లేకుండా విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని కమిషనర్ మహ్మద్ షేక్‌ను కోరారు. వినతి పత్రం అందించిన వారిలో నాయకులు దయాకర్, చందు ముదిరాజ్, మహేశ్వర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, ప్రదీప్‌కుమార్, వివేకానంద,ఆంజనేయులు,నరేష్‌గౌడ్, శ్రీశైలంయాదవ్ పాల్గొన్నారు.

## ప్రాథమిక దశలోనే కుష్టు వ్యాధిని నివారించాలి



**పెబ్బేరు, సెప్టెంబరు9 ప్రభాతవార్త:** పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రముకు రాష్ట్ర కుష్టు వ్యాధి నివారణ బృందం కుష్టు వ్యాధి రహిత సమాజం కొరకు వైద్య సిబ్బందితోపాటు సమాజంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర కుష్టు వ్యాధిబృంద సభ్యులు పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ వైద్య సిబ్బందికి,ఆశా వర్కర్లకు వ్యాధిపై అవగాహన కల్పించారు.ఈ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి మల్టీ డ్రగ్‌థెరఫీ మాత్రలు చికిత్స అందించినచో వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చని అంగవైకల్యం రాకుండా నివారించవచ్చని తెలియజేశారు. గ్రామంలో కుష్టు వ్యాధి సర్వేపై పూర్తిగా అవగాహన కల్పించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని కుష్టు వ్యాధి ఉన్న వారిని పరిశీలించారు.లెప్రసీ రికార్డ్స్,రిపోర్టులు పరిశీలించి తగుసూచనలు తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బృంద సభ్యులు జూనియర్ వైద్యాధికారి డా. సంపత్,జిల్లా పారామెడికల్ అధికారి వెంకటేశ్వర చారి, సకలరెడ్డి,కృష్ణయ్య,స్టాటికల్ ఆఫీసర్ సురేష్,మండల వైద్యాధికారి డా.ప్రవళిక, హెల్త్ సూపర్వైజర్ స్వరూప,పార్వతి, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్,తిరుపతయ్య, డాటా ఎంట్రీ ఆపరేటర్ రాజేష్‌గౌడ్,ల్యాబ్ టెక్నీషియన్ రాజు,ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు జిల్లాకు తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాక

**మహబూబ్‌నగర్, సెప్టెంబరు9 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా గ్రామ,పట్టణ స్థానిక సంస్థల అధికారులతో సమీక్ష మహబూబ్‌నగర్, సెప్టెంబరు 9 ప్రభాతవార్త: తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, సభ్యులు బుధవారం మహబూబ్ నగర్ జిల్లాకు రానున్నారు.ఉదయం 10.15 గంటలకు హైదరాబాద్ నుండి మహబూబ్‌నగర్ ఆర్అండ్‌బి అతిథి గృహంకు చేరుకుంటారు. ఉదయం 11 గం.లకు మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా గ్రామ,పట్టణ స్థానిక సంస్థల అధికారులతో సమీక్ష సమావేశంనిర్వహిస్తారు. సాయంత్రం 4.30 గంలకు హైదరాబాద్ బయలు దేరి వెళుతారు.

# చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరం

### -న్యాయ అవగాహన సదస్సులో సీనియర్ సివిల్ జడ్జి డి ఇందిర

**భూత్పూర్,సెప్టెంబర్ 9,ప్రభాతవార్త:** చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఎంతో అవసరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డిఇందిర స్పష్టం చేశారు. జాతీయ,రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశానుసారం మంగళవారం చైల్డ్ ఫ్రెండ్లీ కమిటీ ఆధ్వర్యంలో భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్ శివారులోని మహాత్మాజ్యోతిభా పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో సీనియర్ సివిల్ జడ్జి ఇందిర బాలికలనుద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా ఇందిర మాట్లాడుతూ బాల్య వివాహాల నివారణ,బాలకార్మిక నిర్మూలన,బాలల చట్టాల వంటి పలు అంశాలపై జడ్జి విద్యార్థినులకు తగిన సలహాలు, సూచనలిచ్చారు.బాలల న్యాయ సేవల పథకం-2024ప్రకారం బాలల హక్కుల్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. బాలలు,మహిళలకు ప్రాథమిక హక్కులను తెలిపేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎల్లవేళలా పనిచేస్తుందని పేర్కొన్నారు. పద్నాల్గేళ్లలోపు పిల్ల లందరూ ఖచ్చితంగా బడిలో ఉండాలని,ఈ మేరకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.బాలలందరూ ఏవైనా సమస్యలెదురైతే 1098కుగాని, న్యాయ సలహాల కోసం జిల్లా న్యాయసేవ అధికార సంస్థ టోల్‌ఫ్రీ నెంబరు 15100కు ఫోన్ చేస్తే అధి కారులు వెంటనే స్పందించి సమస్యకు పరిష్కారం చూపుతారని పేర్కొన్నారు.పిల్లల హక్కులకు భంగం వాటిల్లకుండా వారికి సహాయం చేసేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చైల్డ్ ఫ్రెండ్లీ కమిటీనేర్పాటు చేసినట్లు తెలిపారు.ఏదేని సమస్య వస్తే తమ న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని జడ్జి ఇందిర సూచించారు. పిల్లల మానసిక స్థితిని అర్థం చేసుకుని టీచర్లు పిల్లలకు విద్యను బోధించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుగుణశ్రీ,వైస్ ప్రిన్సిపాల్ రాధారాణి,పారా లీగల్ వాలంటీర్లు శివన్న, నాగభూషణం, పల్లెమోని యాదయ్యలతో గురుకుల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బాలల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న చైల్డ్ హెల్ప్ లైన్ సూపర్వైజర్ నవీన్

**ఇటిక్యాల సెప్టెంబర్ 9, ప్రభాతవార్త:** బాలల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని బాలికలకు చిన్న వయసులోనే వివాహాలు జరిపిస్తే కఠిన చట్టాలు ఉన్నాయని బాలల పరిరక్షణ కమిటీ విభాగం చైల్డ్ హెల్ప్ లైన్ సూపర్వైజర్ నవీన్ అన్నారు. చైల్డ్ హెల్ప్ లైన్ సూపర్ వైజర్ నవీన్ మాట్లాడుతూ..జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి నెల 2వ మంగళవారం గ్రామ స్థాయి బాలల పరిరక్షణ కమిటీ సమావేశం మంగళవారం మండల పరిధిలోని గోపల్ దిన్నె గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో బాలల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. బాలల రక్షణ సంరక్షణ అవసరమైన పిల్లల కోసం ఈ బాల రక్ష భవన్ ఏర్పాటు చేశారని, మరియు ఈ బాల రక్ష భవన్ అందిచే సేవలు మరియు అదేవిధంగా బాల్యం పిల్లల హక్కు అని వారు అందరూ కూడా స్వేచ్ఛా వాతావరణంలో పెరగాలని చిన్న వయసు నుండి లక్ష్యం పెట్టుకొని బాగా చదువుకోవాలని బాలికల పట్ల సోదరాబావంతో ఉండాలని సూచించారు. బాలలు ఎవరి నుంచైనా ఇలాంటి వేధింపులకు గురవుతున్నట్లు తెలిస్తే వెంటనే 100 లేదా 1098కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా చిన్న వయసులోనే పెళ్లిలు చేయడం చట్ట రీత్యా నేరం అని అయితే బాల్య వివాహం చేస్తున్నట్లు తెలిస్తే గ్రామంలో ఉండే బాలల పరిరక్షణ కమిటీకి లేదా డయల్ 100 లేదా 1098 కి ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.సామాజిక మధ్యమం వల్ల పిల్లలు చెడు అలవాట్లు లోనయ్యే అవకాశం ఉంటుంది కాబట్టి బాలల అందరూ కూడా కేవలం మంచి విషయాల కోసం మాత్రమే ఫోన్‌లు ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రామకృష్ణ,తివిలీ మహేశ్వరీ. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాఘవేంద్ర రెడ్డి, అంగన్వాడి టీచర్ మార్తమ్మ. ఆశ కార్యకర్త సలోని. గ్రామ పెద్దలు మహేశ్వర్ రెడ్డి. బాలికలు. గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు..

# ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

**ఆత్మకూర్ సెప్టెంబర్9,ప్రభాతవార్త:** ఆత్మకూరు మండలంలోని జూరాల గ్రామంలో విధులు నిర్వ హిస్తున్న ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి మరియు శాంతన్న టీచర్లను జూరాల వాకర్స్ టీం ఆధ్వర్యంలో మంగళవారం రోజు ఘనంగా సన్మానించారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరిం చుకొని ఈనెల 5వ తేదీన వనపర్తి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయులుగా సన్మానం పొంది ధృవీకరణ పత్రాలను అందుకున్న నేపథ్యంలో భవిష్యత్తులో భావిభారత పౌరులను తీర్చిదిద్దేందుకు మరింతగా శ్రమించి విధినిర్వహణలో శక్తివంచన లేకుండా కృషి చేయాలంటూపలువురు ఉపాధ్యాయ బృందం మిత్రులు ఆకాంక్షించారు జూరాల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీజే విశ్వేశ్వర్, విశ్రాంత ఉద్యోగులు బాలమణియం తదితరులతో పాటుగా ఉపాధ్యాయులు వీరన్న, వెంకటేష్ పాల్గొన్నారు.

**ఊట్కూర్, సెప్టెంబరు9 ప్రభాతవార్త:** ఊట్కూర్ మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రం వద్ద జిల్లా, మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన ఉపాధ్యాయులను తపస్ మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా తపస్ సమన్వయకర్త నర్సింగప్ప, మండల అధ్యక్షులు కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనది. ఇలాంటి పవిత్రమైన వృత్తిలో ఉండటం పూర్వజన్మ సుకృతమే. బడుగు-బలహీనవర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలి" అని పేర్కొన్నారు.జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న వారిలో అనురాధ (జిహెచ్ఎం, పులిమామిడి) నారాయణ (ఎస్ఏ సోషల్ బాలికల పాఠశాల, ఊట్కూర్) నాగేందర్ లోమ్టే (ఎస్ఏ హిందీ, బాలురపాఠశాల, ఊట్కూర్)రమేష్ (ఎస్ఏ హిందీ, జడ్పిహెచ్ఎస్ బిజ్వార్)ప్రతిభ (జిపిఎస్, పులిమామిడి) ఎం.డి. గౌస్(యుపిఎస్,పగిడిమర్రి)మండల స్థాయిలో అవార్డు అందుకున్న వారు: జ్ఞానేశ్వరి బన్సేష్, పృథ్వీరాజ్, శిరీష, సుజాత, కల్పన, విక్టర్ పాల్, భ్రమరాంబ, మునీరుద్దీన్, శశిరేఖలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ కార్యదర్శి గోపాల్, జిల్లా మీడియా ఇన్‌చార్జ్ కిరణ్, వెంకట్ రెడ్డి, రమేష్, శ్రీనివాస్, ధనుంజయ, సంతోష్, నరసింహులు, బాలు, శివరాజ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

# పేద విద్యార్థులు అంటే ప్రభుత్వానికి చిన్న చూపెందుకు?

### బిఆర్ఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్



విద్యార్థినిలతో మాట్లాడుతున్న బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్

**వనపర్తి ప్రతినిధి, సెప్టెంబరు9 ప్రభాతవార్త:** గురుకులాల్లో చదివే పేద విద్యార్థులు అంటే ప్రభుత్వానికి ఇంత చిన్నచూపు ఎందుకని బిఆర్ఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్ అన్నారు. మంగళవారం బుద్ధారం గురుకుల పాఠశాల ముందు బీఆర్ఎస్ నాయకులు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గట్టు యాదవ్ మాట్లాడుతూ ఇటీవల బుద్ధారం గురుకుల పాఠశాలలో విద్యార్దినిలను ఎలుకలు కొరికిన ఘటనలో



చెత్తతో నిండిపోయిన బాత్‌రూంలు

గాయపడ్డ విద్యార్థినిలను పరామర్శించేందుకు వెళ్లిన బిఆర్ఎస్ నాయకులను దుర్మార్గులని సంబోధించడం ఏంటని అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా ఉయ్యాలవాడ లో ఘటన మరువకముందే నేడు వనపర్తి జిల్లా బుద్ధారంలో మరో ఘటన జరగడంతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తాదనే ఆలోచనతో అధికారులు కప్పిపుచ్చుతున్నరని ఆరోపించారు. విద్యార్థులు పడుకునే గదుల పక్కన నీచమైన వాసనతో బాత్రూంలు,వాటర్ లీకేజీలతో బిల్డింగ్ గోడల పైన పాకరా పట్టి ఉండడం చూస్తే ప్రభుత్వానికి పేద విద్యార్థుల పట్ల ఎలాంటి అభిప్రాయం ఉందో తెలుస్తుందని అన్నారు.ఓ వైపు గేటు ముందు విద్యార్థుల పక్షాన బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేస్తుండగా అధికార పార్టీ నాయకులతో ప్రిన్సిపల్ మంతనాలు జరపడం ఏంటని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ బుద్ధారం గురుకుల బాలికల పాఠశాలలో అన్ని వసతులు కల్పించి, నిరక్ష్యానికి కారణమైన ప్ ప్రిన్సిపల్ పై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గోపాల్‌పేట మండల అధ్యక్షులు బాలరాజు, బిఆర్ఎస్‌వి జిల్లా అధ్యక్షులు హేమంత్, సూర్యవంశం గిరి, ఇమ్రాన్, చంద్రశేఖర్, మతీన్, చిట్యాల రాము, జోహెబ్, శ్రీను, నాగరాజు, కాశినాథ్, జహంగీర్, లాలు, వెంకటేష్, మహేందర్, శివ బుద్దారం బీఆర్ఎస్ నాయకులు బిళ్ళకంటి రాజు, వెంకటయ్య హర్యానాయక్, కృష్ణారావు, ఎండీ.గౌస్, లచ్చగౌడు, ఏషమోని శేఖర్, ఓంకార్, తోళ్లరవి లక్ష్మయ్య, రాందాస్, రాజు, వాకిటి తిరుపతి, సురేష్, గోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయ పాత్ర కీలకం

### 17 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన మండల విద్యాశాఖ అధికారులు



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

**ఇటిక్యాల సెప్టెంబర్ 9, ప్రభాతవార్త;** పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ వారి బోధన ద్వారా విద్యార్థుల భవిష్యత్తును ఒక స్థాయిలో తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో విలువైనదని ఇటిక్యాల ఎర్రవల్లి మండలాల విద్యాశాఖ అధికారులు వెంకటేశ్వర్లు. అమీర్ పాష గుర్తు చేశారు. ఈనెల 5వ తేదీ జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని మండల పరిధిలోనిఉన్నత పాఠశాలలో ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులలో ప్రతిభ ఉన్న వారిని 17 మంది ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి ఎంపిక చేశారు. అందులో భాగంగా వీరికి మంగళవారం మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన వారిని ఘనంగా శాలువా పూలమాలలతో సన్మానం చేసి ఉత్తమ ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు తాను పనిచేస్తున్న పాఠశాలలో విద్యార్థులకు మంచి బోధనతో పాటు క్రమశిక్షణ. మంచి లక్షణాలు నేర్పించాలని ఉపాధ్యాయులు నేర్పిన జ్ఞానాన్ని విద్యార్థులు భవిష్యత్తులో ఎన్నో శిఖరాలను అధిరోహిస్తారని దానితో ఇటు ఉపాధ్యాయులకు అటు తల్లిదండ్రులకు గ్రామాలకు విద్యార్థులు మంచి పేరు ప్రతిష్టలు తీసుకొస్తారని గుర్తు చేశారు. సమాజంలో ఉపాధ్యాయులకు ఎంతో గౌరవం ఉందన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా 17 మంది ఎంపిక కాగా 9 మంది ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లు ఉపాధ్యాయులు. ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన 7 మంది ఎస్జిటి ఉపాధ్యాయులు. ఎమ్మార్సీ ఆఫీసు కార్యాలయ సిబ్బంది ఒకరు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారు.ఈ సమావేశానికి ఆయా ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాగుంటన్న. భాస్కర్. రెడ్డి నాయక్. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యతోపాటు క్రమశిక్షణ ముఖ్యం



నూతన విద్యార్థులతో అధ్యాపక బృందం

**బిజినేపల్లి, సెప్టెంబరు9 ప్రభాతవార్త:** విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణను, మంచి నడవడికను అలవర్చుకోవాలని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ డా. పిరాములు సూచించారు. పాలెం డిగ్రీ కళాశాలలో మంగళవారం విద్యార్థులు ఘనంగా ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ సమాజంలో తెలివైన వారు అన్ని అవకాశాలను వినియోగించుకొని ఉన్నత శిఖరాలకు చేరుతారని తెలిపారు. నాగర్ కర్నూల్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ ఐడి కళాశాల ప్రిన్సిపల్ డా.మధన్‌మోహన్ మాట్లాడుతూ జీవించినంత కాలం పదిమందికి గుర్తుండేలా జీవించాలని సూచించారు. మంచి వ్యక్తిత్వంఅలవర్చుకుని, విద్యాబుద్ధులు నేర్చుకుని ఉన్నత స్థానాన్ని చేరుకోవాలని తెలిపారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అధ్యాపకలను విద్యార్థులు సన్మానించుకున్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ డా.శ్రీనివాసులు,వైస్ ప్రిన్సిపల్ డా సుష్మ,నాగరాజు,శివ, డా.నాగలింగం, డా.రాధాకుమారి, డా. స్వప్న,కవిత, వెంకటేష్, ప్రవళిత, రమేష్,ప్రకాష్,మనోజ్, యాదగిరి, రాములు విద్యార్థులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

**నారాయణపేట, సెప్టెంబరు9 ప్రభాతవార్త:** నారాయణపేట నియోజకవర్గం మరికల్ మండల కేంద్రంలోని మాజీ సర్పంచ్ జోగు రామస్వామి సోదరుడు జోగు బాలయ్య ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందాడు.వారి కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే యస్.రాజేందర్‌రెడ్డి వారిఇంటికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసినివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించిమనోధైర్యం నూరిపోశారు. కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు,యువ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం

**మక్తల్ టౌన్, సెప్టెంబరు9 ప్రభాతవార్త:** లయన్స్ క్లబ్ మక్తల్ భీమా ఆధ్వర్యంలో పాలమూరు రాంరెడ్డి కంటి ఆసుపత్రి, ప్రోగ్రాం చైర్మన్ అనుగొండ శ్రీనివాస్ సహకారంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైనట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సత్యాం జనేయులు తెలిపారు. సుమారు 80 మందికి పైగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా 40మందికి వెంటనే కంటి శస్త్ర చికిత్సలు అవసరమైనట్లు గుర్తించి, పాలమూరు రాంరెడ్డి కంటి ఆసుపత్రికి ఉచిత ఆపరేషన్ కోసం తరలించినట్లు తెలిపారు. లయన్స్ క్లబ్ మక్తల్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు వేల సంఖ్యలో ఉచిత కంటి ఆపరేషన్లు చేశామని చెప్పారు.కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జాయింట్ సెక్రటరీ మామిళ్ల పృథ్వీరాజ్, కంటి వైద్య సిబ్బంది జ్యోతి, ఖాజా, తదితరులు పాల్గొన్నారు.

## 14 డీజేలు సీజ్ : కేసు నమోదు



డిజెలను సీజ్ చేసిన పోలీసులు

**మక్తల్ టౌన్, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గణేష్ నిమజ్జనం సందర్భంగా జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ డీజేలను నిషేధించడం జరిగిందని పలుమార్లు మంటపాల ఆర్గనైజర్స్‌తో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి వారికి తెలిపిన ఆర్డీవో జారీ చేసిన ఆర్డర్ కాపీని అందరికీ ఇచ్చిన నిబంధనలకు విరుద్ధంగా మక్తల్ గణేష్ నిమజ్జనంలో వినియోగించిన డిజె సౌండ్ సిస్టం 14 డీజేలను సీజ్ చేసి డీజే డ్రైవర్స్, ఓనర్స్, మండపాల ఆర్గనైజర్లపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మక్తల్ ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపారు.

## శ్రీశ్రీరంగనాయక స్వామి కళ్యాణ మహోత్సవం

**శ్రీరంగాపూర్, సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో గల ఎంతో ప్రసిద్ధిగాంచిన శ్రీ శ్రీ రంగనాయక స్వామి దేవస్థానం నందు బుధవారం జన్మ నక్షత్రం రేవతి నక్షత్రం సందర్భంగా ఉదయం 10 గం.లకు శ్రీ శ్రీ రంగనాయక స్వామి వారి కళ్యాణ మహోత్సవం జరగనుంది. కావున భక్తులందరూ స్వామి వారి కల్యాణంలో పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించగలరని ఆలయ అర్చకులు తెలియజేయడం జరిగింది.

## హెచ్ఐ/ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం

**ఊట్కూర్, సెప్టెంబరు9 ప్రభాతవార్త:** ఊట్కూర్ మండల పరిధిలోని పులిమామిడి గ్రామంలో వైఆర్జీ కేర్ సంస్థ ఆధ్వర్యంలో కెజిబీవీ పాఠశాల/కళాశాలలో విద్యార్థులకు హెచ్ఐవీ/ఎయిడ్స్, టి.బి.పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ డిఆర్‌పి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెచ్ఐవీ పట్ల అవగాహన కలిగి ఉండాలని, తమ ఆరోగ్య స్థితిని క్రమం తప్పకుండా తెలుసుకోవాలని సూచించారు. హెచ్ఐవీ ఎలా వస్తుంది? ఎలా రాదు? నివారణ చర్యలు ఏమిటి? సోకిన వారికి ఎలాంటి వైద్య సహాయం అందించాలి? సోకిన వారిని సమాజం ఎలా స్వీకరించాలి?వంటిఅంశాలను విద్యార్థులకు వివరించారు. అలాగే హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణ చట్టం-2017, దీనికి సంబంధించిన ఉచిత హెల్ప్‌లైన్ 1097 గురించి కూడా వివరించారు. వైఆర్జీ కేర్‌సంస్థ ద్వారా ఉమ్మడి మహబూబ్‌నగర్‌జిల్లాలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు, హెచ్ఐవీ సోకిన వారికి ఏఆర్టీ చికిత్స, క్రమం తప్పని రక్తపరీక్షలు అందిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కెజీబీవీ ప్రత్యేకాధికారి బి.లక్ష్మి, సూపర్‌వైజర్ కృష్ణ, అధ్యాపక బృందం, సిఎల్‌డబ్ల్యూ అశోక్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## యువనాయకుడికి పరామర్శ

**దామరగిద్ద, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** దామరగిద్ద మండలం కానుకుర్తి గ్రామంలో బిఆర్ఎస్ యువ నాయకులు కృష్ణారెడ్డి మామా భీంరెడ్డిరాంరెడ్డి అనారోగ్య కారణాలతో మరణించినందున వారి భౌతికాయాన్ని పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి మనోధైర్యాన్నిచ్చిన వారిలో మాజీశాసనసభ్యులు,బిఆర్ఎస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు యస్.రాజేందర్ రెడ్డిలు ఉన్నారు.ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వ్యాసరచన పోటీలలో శ్రీవాణికి ప్రథమ బహుమతి



**తెలకపల్లి, సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో "అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం " అనే అంశం పై నిర్వహించిన వ్యాస రచన పోటీలో మండల కేంద్రంలోని శాంతినికేతన్ విద్యాలయానికి చెందిన పదవ తరగతి విద్యార్థిని మొకురాల శ్రీవాణి అత్యంత ప్రతిభ కనబరిచి మండల స్థాయిలో ప్రథమ బహుమతి సాధించారు. విద్యార్థి శ్రీవాణిని మంగళవారం పాఠశాల ప్రిన్సిపల్ దీప సెబాస్టియన్, పాఠశాల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల నిర్వాహకులు సురేందర్‌రావు, ఇంద్రకుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

# కాళోజీకి ఘన నివాళి



ఎన్టీఆర్ కళాశాలలో కాలేజీ జయంతి వేడుకలు



తాడూరు పాఠశాలలో కాళోజీకి ఘనంగా నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



కాళోజీ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

## ◆ పాలమూరు విశ్వవిద్యాలయం, ఎన్టీఆర్, ఎంవీఎస్ కళాశాలలో కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు9 ప్రభాతవార్త:** పాలమూరు విశ్వ విద్యాలయం ఫార్మసీ కళాశాల ఆడిటోరియంలో జరిగిన కాళోజీ నారాయణ రావు జయంతిని పురస్కరించుకుని ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎన్ శ్రీనివాస్ హాజరై ప్రసంగించారు. కాళోజి నారా యణరావు తెలంగాణ తొలి దశ ఉద్యమంలో మరియు మలిదశ నిర్మాణంలో కీలకపాత్ర పోషించారని, కవులు, కళాకారులు రచయి తలను మేలుకొల్పడంలో కాళోజి నారాయణరావు గారి పాత్ర మరువలేనిదన్నారు. ఆదేర్ల కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు కేవలం కవి మాత్రమే కాదు, ఆయన ఒక స్వాతం త్ర్య సమరయోధుడు, సామాజిక సంస్కర్త, ప్రజాస్వామ్యవాద అన్నారు. లా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వంగరి భూమయ్య, ప్రిన్సి పల్ పిజి కాలేజ్ కొల్లాపూర్ డా. మార్కోపోలోనియస్ , కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎన్ఎస్ఎస్ సెల్ కోఆర్డినేటర్ డా. ప్రవీణ మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ నాగం కుమా రస్వామి, అడిషనల్ సిఓఈ అనురాధ రెడ్డి, ప్రిన్సిపాల్ ఫార్మసీ కాలేజ్ డా. రవికాంత్, బోధన బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థిని, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**ఎన్టీఆర్ కళాశాలలో:** స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో తెలుగువిభాగం ఆధ్వర్యంలో కాళోజి నారాయణరావు జయంతి ఉత్సవాలలో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి. రాజేంద్రప్రసాద్ సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ కాళోజి జీవిత విశేషాలు తెలియజేస్తూ, ఆయన తనకలం ద్వారా జాతీయోద్యమ, తెలంగాణ సంగ్రా మంలో తన బాణినీ, వాణినీ వినిపించి పలుమార్లు జైలు జీవితాన్ని అనుభ వించి, ప్రజలను తన కవితల ద్వారా చైతన్యపరిచి, ప్రజల గొడవే నా గొడవగా తన అక్షరాలని కవిత్వానికి ఊపిరిగా ఊది "ఉద్యమమే ఊపిరిగా ఊపిరే ఉద్యమంగా" బ్రతికినంత కాలం ప్రజల పక్షాన నిలిచి ప్రభుత్వాన్ని ధిక్కరించిన వ్యక్తి కాళోజి అని అన్నారు. తెలుగు విభాగాధిపతి డా. ఎల్. లక్ష్మీనరసింహారావు మాట్లాడారు. ఈ వేదిక పైన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన వైస్ ప్రిన్సిపాల్ డా. అమీనా ముంతాజ్, ఐక్యూఎసి కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీదేవి తెలుగువిభాగంఆధ్వర్యంలో సన్మానించారు. తెలుగు విభాగం అధ్యాపకులు, సునీత, హేమలత, ప్రభాకర్, కృష్ణుడు, మల్లికార్జున్, మధుసూధన్‌శర్మ, మద్దిలేటి, ఇతరఅధ్యాపకసిబ్బంది పాల్గొన్నారు.

**ఎం.వి.ఎస్ కళాశాలలో:** ప్రజాకవి కాళోజి నారాయణ రావు జయంతి సందర్భంగా ఎంవీఎస్‌కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ డా. ఏనుగు నరసింహ రెడ్డి పాల్గొని కాళోజీనారాయణరావు సాహిత్యం ద్వారాచేసిన సేవలను గుర్తు చేసి ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు.

**ఉప్పునుంతలలో:** మండలంలోని తాడూరు ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా మంగళవారం పద్మభూషణ్ కాళోజి నారాయణరావు జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలో వివిధ రకాలైన తెలుగు భాషా నాటకీకరణ, పాటలు, పద్యాలు, ఉపన్యాసాలు విద్యార్థులచే చేయించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ ఎం రామస్వామి మాట్లాడుతూ కాళోజి నారాయణరావు 1914 సెప్టెంబర్ 9న జన్మించారని, ఆయన ప్రజాకవి, సాహితీ వేత్త, పద్మ భూషణ్, పేదలపక్షపాతి, పౌర హక్కుల నేత, మానవ హక్కుల దాత సమాజంలో ప్రజలంతా స్వేచ్ఛగా, సమానత్వంతో ఆధిపత్యం, అణచివేత, అసమానతలు లేని మానవీయ సమాజం కోసం అహింస వాదిగా జీవితాంతం నిరంతరం పోరాడిన గొప్ప వ్యక్తిని కొనియాడారు. ప్రజల బాధల్ని గొడవలన్నీ నా గొడవలో తెలియజేశారు. పుట్టుక నీది, చావు నీది బతకంతా దేశాన్ని ది అని నినాదించిన గొప్ప కవి అని, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తన కాలాన్ని , గలాన్ని విప్పిన స్వాతంత్ర సమరయోధులు కాళోజి నారాయణరావు అని అన్నారు. నా గొడవలో సామకాలిన, సామాజిక సమస్యలను నిర్మొహమాటంగా నిక్కచ్చిగా, కటువుగా, పాలకులపై సంధిస్తూ, సామాన్య ప్రజలస్థితిగతులను చెప్పినటు వంటి గొప్ప యోధుడు మాడపాటి హనుమంతరావు, బూరుగుల రామకృష్ణారావు, పీవీ నరసింహారావు వంటి ఉద్దండులతో కలిసి అనేక ఉద్యమాలతో పాల్గొన్న వ్యక్తి అని సూచించారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు జక్క రామస్వామి, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ, వసంత కుమార్, కమల, శ్యామల, గోపి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

**మక్తల్ టౌన్, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** మంతన్ గోడ్ గ్రామంలో జిల్లా పరిషత్‌ఉన్న పాఠశాలలో తెలంగాణ భాషా దినోత్సవం ఘనంగా జరిగింది. గౌరవ గజిటెడ్ హెడ్మాస్టర్ అమీరుద్దీన్ ఆధ్వర్యంలో, విద్యార్థినిలు మౌనిక, అనూష ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా కాళోజీ చిత్రపటానికి పూలమాల వేయడంతో కార్యక్రమం మొదలైంది. తెలుగు ప్రాంతాలకు సంబంధించిన కవుల జీవితాన్ని, సాహిత్యాన్ని, ముఖ్యంగా తెలంగాణ సమాజానికి కాళోజి చేసిన సాహిత్య కృషిని గుర్తు చేసుకున్నారు. కాళోజి నిజాం రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడటమే కాదు అని జైలు గదిలో బందీగా ఉన్నప్పుడు కూడా కవితలు రాసాడనీ, 1969 తెలంగాణ ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూర్యచంద్ర, వెంకటేష్, అశోక్, లక్ష్మి నరసింహచారి, సునంద పాల్గొన్నారు.

**ప్రజలను చైతన్య పరిచిన మహనీయుడు కాళోజీ: కలెక్టర్ బి.యం.సంతోష్**

**గద్వాల టౌన్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త:** కాలాన్ని ఆయుధంగా మార్చుకుని తన కవిత్వం, రచనల ద్వారా ప్రజలకు చైతన్యం కల్పించిన మహనీయుడు ప్రజాకవి కాళోజీ నారాయణ రావు అని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రజా కవి, పద్మ విభూషణ్ స్వర్గీయ కాళోజీ నారాయణ రావు 111వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ, నర్సింగా రావు, ఎ.ఓ భూపాల్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ పాషా, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ఇటిక్యాల సెప్టెంబర్ 9, ప్రభాతవార్త;** తన కవితలు రచనల ద్వారా ప్రజలలో చైతన్యం నింపిన మహనీయుడు ప్రజాకవి కాళోజి నారాయణరావు అని అలాగే తెలంగాణ ఉద్యమ ఊపిరిగా జీవించిన ప్రజా కవి. తెలుగు భాష ప్రజల అవసరాల కోసం కాళోజి నారాయణరావు నిరంతరం కృషి చేశారని తాహసిల్దార్ వీరభద్రప్ప గుర్తు చేశారు. మంగళవారం తాహసిల్దార్ కార్యాల యంలో కవి కాళోజి నారాయణరావు111వ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి తహసీల్దార్ వీరభద్రప్ప. డిప్యూటీ తాసిల్దార్ నందిని. ఆర్ఐలు మనోహర్. మదన్ మోహన్. కార్యాలయ సిబ్బంది కలిసి ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు.

**ఊట్కూర్, సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** ఊట్కూర్ మండలకేంద్రంలోని సీపీఎస్ ప్రాథమిక పాఠశాలలో ప్రముఖ కవి, ప్రజాకవి కాలోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కాలోజీ జీవితం, ఆయన రచనలు, సమాజంపై చూపిన ప్రభావం గురించి ప్రసంగించారు. హెడ్‌మాస్టర్ గురునాథ్‌సర్ మార్గదర్శకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాస్కర్, విద్యార్థుల బృందం పాల్గొన్నారు. కాలోజీ రచనలు ప్రజల్లో సామాజిక చైతన్యం రేకెత్తించాయని, ఆయన ఆలోచనలను ఆచరణలో పెట్టుకోవాలని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.







# వైభవంగా రథోత్సవం

**మొదటి పేజీ తరువాయి భాగం..**

ఉన్న శివభక్తులు ఓం నమశ్శివాయ నామస్మరణ చేస్తూ అగ్ని గుండంలో నడిచారు. శివనామస్మరణతో అగ్నిగుండం లో నడుస్తే సకల పాపాలు తొలుగుతాయని భక్తులు విశ్వసిస్తారు. అనంతరం ఉదయం 10 గంటలకు స్వామి వారి పల్లకిలో శ్రీఆంజనేయ స్వామి చిత్రపటం నుంచి గ్రామాల్లోని పురవీధుల గుండా పల్లకిని ఊరేగిస్తూ అడుగడుగునారంగులు చల్లుకుంటూ తీర్థావళి నిర్వహించారు. అక్కడి నుంచి నేరుగాఊక చెట్టు వాగులోని పవిత్ర జనాలతో స్వామివారికి నది స్నానం చేసి శ్రీఆంజనేయ స్వామి దేవాలయానికి భక్తులు చేరుకున్నారు. అక్కడ భజన కీర్తనలను ఆలపించారు. పెదమంగళ హారతితో ఉత్సవాలు ముగిశాయి. ఈ బ్రహ్మోత్సవాలలో భక్తులకు శ్రీఆంజనేయ స్వామి దేవాలయంలో మల్లికార్జున కురవ సంఘం, శివాలయంలో దాసరి రామచంద్రయ్య భక్తుడు ఉచిత అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. స్వామి వార్ల ఉత్సవాలనుతిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

# చర్లకోల శ్వేతారెడ్డి విగ్రహావిష్కరణ



**మొదటి పేజీ తరువాయి భాగం..**

అందరూ శ్రద్ధాంజలి ఘటించారు. ఈకార్యక్రమానికి మాజీమంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్ రెడ్డి, ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డి, ఉమ్మడి జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, మర్రి జనార్ధన్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, నరేందర్‌రెడ్డి, అంజయ్య యాదవ్, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి, గద్వాల బిఆర్ఎస్ ఇన్చార్జ్ బాస్ హనుమంతు నాయుడు, మాజీ కార్పొరేషన్ చైర్మన్‌లు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు హాజరయ్యారు.

# 'పాలమూరు'ను పడావు పెట్టిండ్రు..

**మొదటి పేజీ తరువాయి భాగం..**

జరిగిందని జాతీయ.. అంతర్జాతీయ స్థాయిలో హంగామా చేస్తున్నారు. మరి పాలమూరు -రంగారెడ్డి ప్రాజెక్టు పరిస్థితి ఏంటి అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టును పడావు పెట్టి ఎటువంటి అనుమతులు లేకుండా డీపీఆర్ లేకుండా నారాయణపేట-కొడంగల్ ప్రాజెక్టు పనులను రూ.4000 కోట్లతో చేపట్టాల్సిన అవసరం ఏమొచ్చిందనిఆయన ప్రశ్నించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాప్రజలు విషయాలు అన్నీ గమనిస్తున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాప్రజల సమస్యల పరిష్కారం కోసం త్వరలోనే పోరాటాలు చేయడానికి కార్యాచరణ రూపొందిస్తామని కేటీఆర్ చెప్పారు.

**వారు ఎటో వారికే తెల్వదు :** పార్టీ మారిన పదిమంది ఎమ్మెల్యేలు వారు ఏ పార్టీయో.. చెప్పుకోలేని పరిస్థితులలో ఉన్నారు. ఇటీవల పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్ అవును మేము 10 మంది ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకున్నాం.. అని చెప్పాడు. చర్యలు తీసుకోవడానికి స్పీకర్‌కు ఇంతకన్నా మరి ఇంకేం ఆధారం కావాలి అని దుయ్యబట్టారు. గద్వాల ఎమ్మెల్యే నేను పార్టీ మారలేదు అంటున్నాడు..!? నేను ఏ పార్టీ నుండి గెలిచానో అదే పార్టీ నాది అంటాడు. మరోసారి అభివృద్ధి పార్టీ అంటాడు..? మరి అసెంబ్లీ సమావేశాలలో కాంగ్రెస్ నాయకులు కేసీఆర్ ను నానా మాటలు అంటుంటే ఆఎమ్మెల్యే ఎందుకు అడ్డుకోలేదు..పార్టీ కార్యక్రమాలకు ఎందుకు హాజరు కావడంలేదని కేటీఆర్ ప్రశ్నించారు. సృష్టిలో ఆడ.. మగతోపాటు మరో జెండర్ కూడా ఉంటుంది. మరి పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఏ కోవకు చెందుతారో అర్థం చేసుకోవాలని చురకలంటించారు. సమావేశంలో మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, మర్రి జనార్దన్ రెడ్డి, ఎస్. రాజేందర్‌రెడ్డి, మాజీఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ పట్ల ప్రభాకర్ రెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కోడుగల్ యాదయ్య, సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రణీల్ చందర్, పాలాది రామ్మోహన్, శ్రీకాంత్, ఇంతియాజ్, రఘుపతి రెడ్డి, పర్వతరెడ్డి, మహమూద్, కృష్ణ, బాలు ఉన్నారు.

# విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేత

**మూసాపేట, సెప్టెంబరు9 ప్రభాతవార్త:** మండలంలోని జానంపేట గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఒక్కరికి రూ.2500 చొప్పున 37మంది విద్యార్థులకు బయోస్టాడ్ కంపెనీ ఆధ్వర్యంలో అ గ్రామ యువకుడు మలేలా శశిధర్ గౌడ్ స్కాలర్షిప్‌లు ఇవ్వడం జరిగింది. ప్రతి సంవత్సరం వివిధ గ్రామాలలో పాఠశాల విద్యార్థులకు ఇవ్వడం జరిగింది ఈ సంవత్సరం జానంపేట గ్రామంలో ఇస్తున్నందుకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా గ్రామంలో గ్రామ అభివృద్ధిలో ముందుండి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తే రామ ప్రజలకు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. గతంలో పాఠశాలకు సీసీ కెమెరాలను అందజేశారు గ్రామ యువకులకు బైక్‌లపై వెళ్లే వారికి హెల్మెట్లు తదితర వస్తువులను అందించారు. రైతులకు కావాల్సిన ఎరువులు అందిస్తూ రైతులకు తాను చేస్తున్న సేవలను కొనియాడారు. పాఠశాల యజమాన్యం స్కూల్ చేస్తున్న సేవలను గుర్తించి మల్లెల శశిధర్‌గౌడ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు బయోస్టాడ్ కంపెనీ సేల్స్ ఆఫీసర్ విజయ్‌కుమార్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు

**నారాయణ పేట, సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** నారాయణపేట మండల తీర్మలాపూర్ గ్రామంలో మంగళవారం ఎస్‌బీఐ కోటకొండ బ్రాంచ్ ఆధ్వర్యంలోఆర్థిక అక్షరాస్యతఅవగాహన సదస్సు జరిగింది. ఎల్‌డిఎమ్ లీడ్ బ్యాంక్ మేనేజర్ విజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, ప్రతి ఖాతాదారు కేంద్ర ప్రభుత్వ పథకాలైన ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన జీవన్ జ్యోతి బీమా యోజనలో చేరి కుటుంబానికి భరోసా కల్పించుకోవాలని సూచిం చారు. అలాగే జన్‌ధన్ యోజన, అటల్ పెన్షన్ యోజన, సుకన్య సమృద్ధియోజన వంటి పథకాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల ఏపిఎం నీలినారాయణ, సీసీశ్రీను, ఐపిఓ నర్సింగరావు, పంచాయతీ కార్యదర్శి నారాయణ నాయక్, సిఎఫ్ఎల్ కౌన్సిలర్ అనసూయ, వివోస్‌తో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

**కృష్ణ, సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** కృష్ణ మండల కేంద్రంలో ఆర్బిఐ విడ్స్ కౌన్సిలర్ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ కృష్ణ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ జీవనజ్యోతి పథకం, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, సుకన్య సమృద్ధి యోజన, అటల్ పెన్షన్ పథకాలతోపాటుఇన్సూరెన్స్ పథకాలపై కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీకార్యదర్శి నరసింహ, వివోఏ లక్ష్మి, బ్యాంకు ఫీల్డ్‌ఆఫీసర్ శివ, నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# కళా ఉత్సవ్‌లో జడ్పీ బాలుర పాఠశాలకు ద్వితీయ బహుమతి

**నారాయణ పేట, సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా స్థాయిలో జరిగిన కళా ఉత్సవ్‌లో 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థుల కోసం నిర్వహించిన ఫోక్, గ్రూప్ డాన్స్ పోటీలలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినీలు ద్వితీయ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఎం. ప్రదీప్ కుమార్ విద్యార్థినీలను, పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు నరసింహ చారిని అభినందించారు.

# పేదల్ని ధనికుల్ని చేయడమే కాంగ్రెస్ లక్ష్యం

## - దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి

**భూత్పూర్, సెప్టెంబర్9, ప్రభాతవార్త:** పేదల్ని ధనికులను చేయడమే సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వలక్ష్యమని దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్)స్పష్టం చేశారు. ప్రతి పేదోడి సంక్షేమం కోసం తమ ప్రభుత్వం ఆహర్నిశలు శ్రమిస్తోందన్నారు. ఉచిత బస్సు, ఉచిత సన్నబియ్యం, ఉచిత కరెంట్ వంటి కనీస అవసరాలను తీరుస్తూ ప్రతి కుటుంబానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రతీ నెల రు. 2వేల వరకు ఆదా కల్గుతుందని పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మెల్యే జీఎంఆర్ భూత్పూర్ మండల, పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తాటిపర్తి, పెద్దతండా, లోక్యతండా, వెల్కిచర్లలో అంగన్వాడీ కేంద్రాలు, బీటీ రోడ్ల నిర్మాణాలకు భూమి చేసి ఎమ్మెల్యే జీఎంఆర్ శంకుస్థాపనలు చేశారు అనంతరం భూత్పూర్ మండలంలో వెల్కిచర్లలో రు.20లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటైన సమావేశంలో ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పేదల సంక్షేమం శూన్యమని విమర్శించారు. గత పాలకులు దోచుకోవడం..దాచుకోవడం తప్పా ప్రజలకు ఒరగబెట్టిందేమిలేదన్నారు. గత పదేండ్ల కాలంలో ఓ ఒక్కరికి ఇల్లు మంజూరు చేయలేదని అన్నారు. తమ ప్రభుత్వం పార్టీలకతీతంగా అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి నిర్మించి ఇస్తోందన్నారు. వెల్కిచర్ల గ్రామానికి 40ఇళ్లుమంజూరు చేశామని, ఇందులో 39ఇళ్లు నిర్మాణాలు పూర్తి చేసుకున్నాయన్నారు. అవసరమైతే వెల్కిచర్లకు మరో 40ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రకటించారు. గ్రామానికి సీసీ రోడ్లు, అండర్‌డ్రైనేజీల నిర్మాణాలకు రు.కోటి వెచ్చించినట్లు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా గతుకుల మయంగా ఉన్న మద్దిగట్ల-వెల్కిచర్లకు, మద్దిగట్ల-వనపర్తి ఆర్అండ్‌బి రోడ్డు పనులు శరవేగంగా జరుగు తున్నాయన్నారు. ఇదేవిధంగా భూత్పూర్ పరిధిలోని నాగర్‌కర్నూల్ రోడ్‌లో ఆర్అండ్‌బి రోడ్ నుంచి కరివెన రోడ్డు బీటీ నిర్మాణం కోసం రు.నాలుగున్నర కోట్ల నిధులు కేటాయించి పనులకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు.

**అభివృద్ధికి మారుపేరు కాంగ్రెస్ : మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి**

కాంగ్రెస్ అంటేనే అభివృద్ధి అని, అభివృద్ధికి మారుపేరు కాంగ్రెస్ అని కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే జీఎంఆర్ నాయకత్వంలో నియోజకవర్గంలోని పల్లెలు, పట్టణాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. భూత్పూర్ మండలంలో అభివృద్ధి పనులకు రు.30లక్షలు మంజూరైతే ఒక్క వెల్కిచర్లకే రు.15లక్షలు వెచ్చినట్లు చెప్పారు. రోడ్లు, ఇళ్లు, లైట్లు, అండర్ డ్రైనేజీల నిర్మాణాలు జరిగి వెల్కిచర్ల పట్టణాన్ని తలపిస్తోందని పేర్కొన్నారు. పిలిస్తే పలికేనాయకుడిగా జీఎంఆర్ ప్రజల్లో చెరగని ముద్రను వేశారన్నారు.


**పదేళ్లలో జరగని పనులు 18నెలల్లోనే జరిగాయి : పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్**

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరగని అభివృద్ధి పనులు, 18నెలల కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతున్నాయని కార్యక్రమంలో పాల్గొన్న పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్ అన్నారు. ప్రతీ గ్రామం, పట్టణంలో అభివృద్ధి పనులు ఎమ్మెల్యే జీఎంఆర్ ముందుండి జరిపిస్తున్నారని పేర్కొన్నారు. గత పాలనకు, ప్రస్తుత కాంగ్రెస్ పాలనను ప్రజలు బేరీజు వేసుకుంటున్నారన్నారు.

కోటి మంది మహిళలను కోటీశ్వరుల్ని చేయడమే ప్రభుత్వ లక్ష్యం

**అమిస్తాపూర్‌లో 26మహిళా స్వయం సేవక సంఘాలకు రు.3కోట్ల 25లక్షల చెక్కు అందజేసిన ఎమ్మెల్యే**

కోటి మంది మహిళలను కోటీశ్వరుల్ని చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జీఎంఆర్ అన్నారు. భూత్పూర్ పట్టణంలోని అమిస్తాపూర్‌లో ఎంఈడీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టుమిషన్ కేంద్రాన్ని ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని 26 మహిళా స్వయం సేవక సంఘాలకు ప్రభుత్వం మంజూరు చేసిన రు.3కోట్ల 25లక్షల చెక్కును ఎమ్మెల్యే మహిళా సంఘాల సభ్యులకు అందజేశారు. ఎస్‌హెచ్‌జీలకు ప్రభుత్వం వడ్డీలేని రుణాలను అందజేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీదేవి, పంచాయతీరాజ్ డీఈఈ లక్ష్మణ్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు రేకులపాటి భూపతిరెడ్డి, మొల్గర నర్సింహ్మారెడ్డి, లిక్కివిజయ్‌గౌడ్, హరియానాయక్, నర్సింహులు, కోరెపవన్‌కుమార్, జైదు శ్రీనివాసులు, వడ్డె శ్రీనివాసులు, పర్వతాలు, వేణయ్య, వెంకట్రాంరెడ్డి, శేఖర్, జాఫంగ్, లావణ్య, నరేష్, కిట్టురెడ్డి, ఎర్రవాపు నర్సింహులు, పల్లె రాంరెడ్డి, వెంకటేష్, దెంది లక్ష్మీకాంత్‌రెడ్డి, తమన్నగౌడ్, టీవీ రెడ్డి, బోరింగ్ నర్సింహులు, గడ్డం ఎల్లప్ప, గడ్డం యాదయ్య, శివరాములు తదితరులు పాల్గొన్నారు.



అమిస్తాపూర్‌లో ఎస్‌హెచ్‌జీ మహిళలకు రు.3కోట్ల 25లక్షల చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

# 13న జాతీయ లోక్ అదాలత్

**■ మహబూబ్‌నగర్ జిల్లా అదనపు సెషన్స్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ కె.కళ్యాణ్ చక్రవర్తి**

**మహబూబ్‌నగర్, సెప్టెంబరు9 ప్రభాత వార్త:** జాతీయ న్యాయ సేవాధికర సంస్థ, హైదారాబాద్ వారి ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని కోర్టులో జాతీయలోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని మహబూబ్నగర్ జిల్లా అదనపు సెషన్స్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ కె. కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు కానీ ఇదివరకు కోర్టు ముందుకు రాని కేసులు కానీ పరిష్కరించుకునే/రాజీ చేసుకునే వేదిక ఈ లోక్ అదాలత్, లోక్ అదాలత్ కేసు దాఖలు చేసినప్పుడుకోర్టు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. న్యాయస్థానంలో పెండింగ్లో ఉన్న సివిల్ కేసు లోక్ అదాలత్‌కి పంపబడి, ఆ తర్వాత పరిష్కరించబడినట్లయితే, వాస్తవానికి కోర్టులో చెల్లించిన కోర్టు రుసుము కూడా పార్టీలకు తిరిగి చెల్లించబడుతుందన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్ లో రాజీ పడ దగ్గ క్రిమినల్ కేసులు సివిల్ కేసులు కుటుంబ తగాద కేసులు, డబ్బు రికవరీకి సంబందించిన కేసులు, మోటర్ వెహికల్ ఆక్సిడెంట్ కేసులు, చిట్ ఫండ్ కేసులు, ఎలక్ట్రిసిటీ కేసులు, ప్రి లిటీగేషన్ కేసులను, ఈ పెట్టీ కేసులను, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను, చెక్ బౌన్స్ కేసులను, బ్యాంకు కేసులను బీఎస్ఎన్ఎల్ ప్రిలిటీగేషన్ కేసులను, స్పెషల్ ఎన్ఐ ఆక్ట్ కేసులను, ఇతర రాజీకి వీలున్న కేసులు సులభంగా పరిష్కరించుకోవచ్చని వెల్లడించారు. మహబూబ్ నగర్ జిల్లా వ్యాప్తంగా 8బెంచిలను ఏర్పాటుచేయడం జరిగిందనీ, జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ మార్గం ద్వారా పరిష్కారం చేస్తారన్నారు. ఇప్పటికే 1748 కేసులను గుర్తించి నోటీసులు జారీ చేయగా, ఇప్పటివరకు సుమారుగా 525 కేసులు పరిష్కరించబడ్డాయి. ఇన్సూరెన్స్ కంపెనీలు, పోలీసుశాఖతోబ్యాంకు మేనేజర్లతో పలుసమావేశాలు నిర్వహించారు. జాతీయ లోక్‌అదాలత్ ఈనెల13న ఉదయం 10.00 గంటలనుండి సాయంత్రం 5.00 గంటలవరకు నిర్వ హించబడుతున్నాయని అవకాశాన్ని కక్షిదారులు, న్యాయవాదులు, సామాన్య ప్రజలు అందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న కళ్యాణ్ చక్రవర్తి

# ప్రతి కేసులోనూ నిందితులకు శిక్ష పడేలా ఆఫీసర్స్ కృషి చేయాలి

**■ వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్**

**వనపర్తి, సెప్టెంబరు9 ప్రభాతవార్త:** కోర్టు కేసులలో శిక్షల శాతాన్ని పెంచడం, తప్పు చేసిన నిందితులకు శిక్ష పడేలా చేయడం ద్వారా ప్రజలకు పోలీసుశాఖపై మరింత గౌరవం, నమ్మకం పెరుగుతుందని జిల్లా ఎస్పి రావుల గిరిధర్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులు, కోర్టు డ్యూటీ కానిస్టేబుల్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కోర్టు కేసుల్లో నిందుతులకు శిక్షలు పడినప్పుడే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని, ఇందుకు అనుగుణంగా కేసులు పెండింగులో లేకుండా చూసుకోవాలని అన్నారు. కోర్టు కానిస్టేబుల్ బాధ్యత చాలా కీలకమైనదని, ఎఫ్ఐఆర్ నమోదు అయినప్పటి నుండి కేసు పూర్తయ్యేంతవరకు నిందితుల నేరాలను నిరూపించేందుకు అవసరమైన రుజువులు, పత్రాలు, సాక్షుల వాగ్మూలంను కోర్టుకు సమర్పించడంలో కోర్టు పోలీసు అధికారులు వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలని సూచించారు. సాక్షులను, బాధితులను సమయానికి కోర్టులో హాజరు పరిచేలా చూసుకోవాలని, బాధితులకు, సాక్షులకు కేసుకు సంబంధించిన విషయాలలో అవగాహన కల్పించాలని అన్నారు. కోర్టు సమాచారం ప్రాసిక్యూషన్‌కు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు సంబంధిత ఎస్సైలకు తెలియజేయాలని అన్నారు. ఈ సందర్భంగా పెండింగ్ కేసుల పరిష్కారానికి సంబంధించి పలువురు కోర్టు కానిస్టేబుళ్లను అడిగి కేసుల పురోగతిపై సూచనలు చేశారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు, వారెంట్స్, సమన్స్ తదితర అంశాలను సమీక్షించారు. ఈ సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, వనపర్తి సీఐ కృష్ణయ్య, డిసిఆర్బి ఎస్సై తిరుపతిరెడ్డి, వనపర్తి పట్టణ ఎస్సై హరిప్రసాద్, పెద్దమందడి ఎస్సై శివకుమార్, జిల్లాలోని అన్ని పోలీస్టేషన్ల కోర్టు డ్యూటీ అధికారులు పాల్గొన్నారు.



కోర్టు డ్యూటీ కానిస్టేబుల్‌లతో సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ

# ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

**లింగాల, సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు శాలువాతో ఘనంగా సత్కరించారు. మండల ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఎంఈఓ బషీర్ అహ్మద్, అంబట్ పల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నిరంజన్, లింగాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కొండయ్య అధ్యక్షతన నిర్వహించారు. మండల స్థాయి ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు హాజరైయ్యారు. ఈసందర్భంగా ఎంఈఓ బషీర్ అహ్మద్ మాట్లాడుతూ విద్యార్థుల విద్యాబోధనలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని అన్నారు. ఉపాధ్యాయ వృత్తి అనేది చాలా గొప్పదని, అంకిత భావంతో పని చేసినప్పుడే మంచి గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు. మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులు కె.బాలు, అజయ్, సుశీలమ్మ, శివప్రసాద్, అరవింద్, పర్వతాలు, కొండయ్య, శ్రీనివాస్‌రెడ్డి, శంకరయ్య, ప్రభాకర్ రావు, పాండుగౌడ్ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎంఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం ఆడుకుంటోంది

**వనపర్తి రూరల్, సెప్టెంబరు9 ప్రభాతవార్త:** ఫీజ రియంబర్స్మెంట్ చెల్లించక విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం ఆడుకుంటుందని ఏబీవీపీ వనపర్తి జిల్లా కన్వీనర్ సాతర్ల అర్జున్ అన్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు మంగళవారం వనపర్తి శాఖ ఆధ్వర్యంలో రాజీవ్ చౌక్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసనలో సుమారు 2000 మంది విద్యార్థులు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రభుత్వంపై తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వనపర్తి జిల్లాకన్వీనర్ అర్జున్ సాతర్ల మాట్లాడుతూ, గత నాలుగేళ్లుగా తెలంగాణ రాష్ట్రంలో 8300 కోట్ల రూపాయల స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు విడుదల కాకపోవడం వల్ల పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులుతీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తల్లిదండ్రులు అప్పులు చేసి కళాశాల ఫీజులు చెల్లించాల్సి వస్తోంది. చదువు పూర్తి చేసిన తర్వాత కూడా సర్టిఫికెట్లు తీసుకోవడానికి విద్యార్థులు యాజమాన్యాల వేధింపులు ఎదుర్కొంటున్నారు. స్కాలర్షిప్ నిధులు రాలేదని విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం ఆడుకుంటోంది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జ్ఞానేశ్వర్, కార్యదర్శి కార్తీక్, బంటి, నితిన్, మనోహర్, కుమార్, నరసింహ, నందు, అనిల్, సంతోష్, మైమూద్ తదితరులు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున విద్యార్థులు హాజరై తమ సమస్యలను గళం విప్పి తెలియజేశారు.